ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సీఎస్ఈ క్రేజ్ 7
ఇంజనీరింగ్ విద్యార్థుల చూపటు
భారీగా గంజాయి స్వాధీనం



తూర్పు..మార్పు: ఎంపీ, ఎమ్మెల్యేలు పరిచయ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అధికారులు

జిల్లా అసెంబ్లీ!

కలెక్టరమ్మ.. కొత్త ప్రయోగం

ఆలోచన ఉంటే.. ఆచరణకు అడ్డేముంటుంది.. ప్రణాళికా బద్ధంగా ముందడుగు వేస్తే సమస్యలకు చోటెక్కడ ఉంటుం ది.. ఎంత పెద్ద సమస్య అయినా ఇట్టే పరిష్కారమైపోతోంది.. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం అదే చేశా రు.. కొత్త కార్యక్రమానికి వినూత్నంగా శ్రీకారం చుట్టారు.. ఇప్పటి వరకూ కలెక్టరేట్‌కు సమస్యలు ఉన్నాయని ప్రజలు రావడమే చూశారు. అయితే కలెక్టర్ మాత్రం ఏకంగా జిల్లా అసెంబ్లీనే నిర్వహించారు. జిల్లా ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు.. ప్రజాప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజక వర్గాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇలా ప్రతినెలా నిర్వహిస్తే బాగుంటుందని ప్రజాప్రతినిధులే అనడం గమనార్హం.

రాజమహేంద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం.. అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం.. ప్రజా శ్రేయస్సే మనందరి లక్ష్యం.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటికి సమప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం జిల్లా స్థాయి అధికారులకు వినూత్నంగా ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు.ఒకరికొకరు పరస్పర సమన్వయంతో జిల్లాను అగ్రగామిగా నిలుపుదామన్నారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులు, రహదారుల మరమ్మతులు, సాగునీటి కాల్వల నిర్వహణ, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం,ఇళ్ల నిర్మాణాలు, రక్షిత మంచినీటి వ్యవస్థ, టిడ్కో గృహాలు కేటాయింపు వంటి సమస్యలను ప్రస్తావించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు వెల్లడించిన సమస్యలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసి పరిష్కారానికి ఒక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రజలకు అందజేయడంలోనూ, అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలుపై పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.కచ్చితమైన ఆలోచనతో అందరూ కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.ఈ పరిచయ కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్,ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, సబ్-కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గత భావజాలం వీడండి..



జిల్లాతో పాటు నా నియోజకవర్గం నిడదవోలులో కూడా మంచినీరు, రోడ్ల మరమ్మతులు, సీజనల్ వ్యాధుల సమస్యలు ఉన్నాయి. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. శానిటేషన్, సాగునీరు కాల్వల్లో తూడు తొలగింపు వంటి వాటిపై వెంటనే దృష్టిపెట్టాలి. సమస్య మూలం తెలుసుకుని పరిష్కరించాలి. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కొం దరు విద్యార్థులకు ఇంకా పుస్తకాలు, కిట్స్ అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.. వెంటనే అందజేయాలి. గత భావజాలం విడనాడి నూతన ప్రభుత్వ మార్గదర్శకాలతో ముందుకు వెళ్లాలి. **- కందుల దుర్గేష్, మంత్రి**

ఆవభూములపై సమగ్ర విచారణ జరపండి..



ఇళ్ల పట్టాల పంపిణీ, ఆవభూముల స్థలాల కేటాయింపు పై సమగ్ర విచారణ జరపాలన్నారు.టిడ్కో ఇళ్లను లబ్ధిదా రులకు అప్పగించాలన్నారు.ఇళ్ల పత్రాల పేరిట కొందరు డబ్బు లు వసూలు చేశారన్నారు.వెలుగు బంద కాలనీలో మౌలిక వసతులు లేవన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రేడియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ సేవలు అందుబాటులోకి తేవాలి.
- ఆదిరెడ్డి వాసు, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే

బరోడా బ్యాంక్ స్కామ్ తేల్చాలి..



జి.యర్రంపాలెంలోని బరోడా బ్యాంక్‌లో రూ.67 లక్షల స్కామ్ జరిగింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలి. గత ప్రభుత్వంలో నేతలు చేసిన తప్పిదాల వల్ల తమకు చెడ్డపేరు వస్తుంది. నియోజ కవర్గంలోని ఇళ్ల పట్టాల సమస్యలు, తొర్రిగడ్డ రిజర్వాయర్ , జలజీవన్ మిషన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే

ప్రతి నెలా ఇలా కలుద్దాం..



ప్రతినెలా ఇలా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావే శాలు నిర్వహిస్తే స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం సులభమవుతుంది. నల్లజర్లలో పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది కానీ మధ్యలో విద్యుత్ స్తంభాలు తొలగించలేదు. ఇక్కడ ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లోపం కనిపిస్తుంది.
- ముద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే

- ఎమ్మెల్యేలు సమస్యలు చెప్పారు..
- వినూత్నంగా నిర్వహించిన కలెక్టర్
- 7 నియోజకవర్గాలపై స్క్రీనింగ్
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- ప్రతి నెలా నిర్వహించాలన్న ఎమ్మెల్యేలు
- అధికారులకు ప్రజాప్రతినిధుల పరిచయం

యూరియా సమస్య పరిష్కరించాలి



అనపర్తి నియోజకవర్గంలో ఈ సీజన్‌లో యూరియా అవసరం చాలా ఎక్కువ. రంగంపేట, సింగంపల్లి సొసైటీల్లో డీడీ చెల్లిస్తేనే కానీ యూరియా సరఫరా చేయనంటున్నారు.వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు దృష్టి పెట్టాలి. పీహెచ్‌సీల్లో మంచినీరు,విద్యుత్ సౌకర్యం కొరత ఉన్నాయి. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే

సమన్వయంతో పనిచేద్దాం..



కొవ్వూరు టౌన్‌లోకి ఆర్టీసీ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలి. కొవ్వూరు - నందమూరు రోడ్డు అధ్వానంగా ఉంది. ఆ రోడ్డుపై దృష్టి సారించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా శ్రేయస్సుకు తీసుకున్న నిర్ణయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఉంటేనే అమలు చేయగలుగుతాం.
- ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే

నిధులు కొరతలేకుండా చూస్తా..



రాజమహేంద్ర వరం అభివృద్ధి, నగర ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి 2027 నాటి పుష్కరాలు మంచి అవకాశం. రాష్ట్రం, కేంద్రంతో సమన్వయం చేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత లేకుండా నేను చొరవ తీసుకుంటా. గోదావరి పరిరక్షణ, రాజమహేంద్రవరం నగరం అభివృద్ధిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయండి. 2027 గోదావరి పుష్కరాలకు 5 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారనే అంచనాలు ఉన్నాయి.
- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

మీతో పాటు నేనూ కృషి చేస్తా..



ప్రజా శ్రేయస్సు కోసం ఎమ్మెల్సీగా మీతో పాటు నేనూ కృషి చేస్తా. ఈ ప్రాంత అభివృద్ధికి మంత్రి దుర్గేష్ చేపట్టే ప్రతి పనికి మద్దతుగా నిలుస్తాం. జిల్లా అభివృద్ధిలో నేను భాగస్వామినవుతా..
- వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

సమస్యల పరిష్కారంపై కార్యాచరణ



ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై అధ్యయనం చేసి పరిష్కార దిశగా కార్యాచరణ సిద్ధం చేయాలి. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో స్వచ్ఛమైన నీరు,పారిశుధ్య నిర్వహణ ఉండేలా చూడాలి. అందరం కలిసి టీంగా ముందుకు వెళదాం.
- పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

ఐదేళ్లూ..చేసిందిదే!

వైసీపీ బాగోతాలన్నీ బయటకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ బాగోతాలన్నీ బట్టబయలవుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు..కొన్నిశాఖలను నిర్వీర్యం చేసింది. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన పరిచయ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఒక బుక్‌లెట్‌లో జిల్లా వివరాలు తెచ్చారు. ఇంత వరకూ నోరెత్తని అధికారులు నెమ్మదిగా సమస్యలను వెలుగులోకి తెస్తున్నారు.బకాయిలు తదితర అంశాలు చూసి ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో వివిధ పథకాల కింద చేసిన పనుల్లో రూ.కోట్ల బకాయిలు ఉన్నాయి. ఏపీఆర్ఆర్‌పి ఏఐఐబీ కింద చేసిన పనులకు రూ.15.84 కోట్లు బకాయి ఉంది. సీఎఫ్ఎంఎస్‌లో జీజీఎంపీ కింద రూ.10.09 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద రూ.6.80 కోట్లు, పీఆర్ఆర్ కింద రూ.2.45 కోట్లు, సీఎండీఎఫ్ కింద 1.79 కోట్లు, నాబార్డు ఆర్ఐడీఎఫ్ కింద రూ. 1.74 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.7కోట్లు బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో క్లియరెన్స్ వెయింట్‌లో ఉన్నాయి. రూ. 11.42 కోట్లు బిల్లులు ఇప్పటివరకూ జనరేట్ కాలేదు. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి గతంలో చేసిన మరమ్మతులకు సంబంధించి రూ.11.96 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా కొత్తగా 133.549 కిలోమీటర్ల రోడ్ల డామేజీ అయ్యాయి. వీటి కోసం రూ.9.11 కోట్లు ప్రతిపాదనలు చేశారు. డ్వామా డిపార్ట్‌మెంట్‌లో వివిధ బిల్డింగ్ మెటీరియల్ వర్కు బిల్లులు రూ.6.40 కోట్లు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ మెటీరియల్ పనులకు సంబంధించి రూ.13 లక్షలు, సీసీ రోడ్లకు సంబంధించి 1.15 కోట్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి రూ.31 లక్షలు, సోక్‌పిట్స్ వర్కుకు కొంత సొమ్ము బకాయి ఉంది. మొత్తం రూ.8 కోట్లు బకాయి ఉంది. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీ ఎంఐపీ) కి సంబంధించి 2022-23కు 653.53 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సబ్సిడీకి రూ.18.30 కోట్లు బకాయి ఉంది. 2023-24కి రూ22.21.73 కోట్లు విడుదలచేయవలసి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో సీపీడబ్ల్యుఎస్‌కు సంబంధించిన ఓ అండ్ఎం పనులకు రూ.23.74 కోట్లు పెండింగ్‌లో ఉంది. జీజీఎంపీకి రూ.7.38 కోట్లు, సీఎండీఎఫ్ పనులకు రూ. 95 లక్షలు మొత్తం రూ. 32.07 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ బోధనా జనరల్ ఆసుపత్రిలో డీఎన్‌బీ విద్యార్థుల స్టయిఫండ్ రూ.39.87 లక్షలు పెండింగ్‌లో ఉంది. ఆల్కహాల్ అండ్ డి -ఎడిక్షన్ సెంటర్ సిబ్బది జీతాలు 8.85 లక్షలు చెల్లించలేదు. సెక్యూరిటీ స్టాఫ్ జీతాలు 5 నెలలకు రూ.40.82 లక్షలు బకాయి ఉంది. కల్యాణమస్తు పథకం కింద 305 మందికి రూ.2.96కోట్లు బకాయి ఉంది. ఉద్యాన శాఖను నిర్వీర్యం చేసేశారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చరల్ (ఎండీహెచ్) కింద 2021 నుంచి 24 వరకూ 3995 మంది లబ్ధిదారులకు రూ. 182 కోట్లు సబ్సిడీ బకాయి పెట్టారు. ఆర్కేవీవై కింద 2021 నుంచి 23 వరకూ 2025 మందికి రావలసిన సబ్సిడీ రూ.3.04 కోట్లు చెల్లించలేదు. మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ సీడ్స్ (ఎన్ఎంఈఓ-ఓపి) కింద 26,904 మంది లబ్ధిదారులకు రూ.28.05 కోట్లు ఇవ్వలేదు. వ్యవసాయ శాఖ విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. వరి ఊడ్పే ప్రాంతాల్లో జింక్ లోపాలు ఉన్నాయి. వాటి కోసం 900 టన్నుల మైక్రోనటీరియంట్‌జిక్ అవసరం ఉంది.ఇలా అన్ని శాఖలలోనూ గత ప్రభుత్వం పెండింగ్ పెట్టింది.



బియ్యం, కందిపప్పు అందిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి

నిత్యావసరాల ధరలు నియంత్రిస్తాం

కందిపప్పు, బియ్యం అమ్మకాలు ప్రారంభించిన మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 11 : బహిరంగ మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం బియ్యం, కందిపప్పులను రైతు బజార్ల ద్వారా సరసమైన ధరలకు విక్రయించేలా కార్యాచరణ చేపట్టిందని మంత్రి కందుల లక్ష్మీదుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ రైతు బజార్‌లో గురువారం సూపర్ ఫైన్ బియ్యం, కందిపప్పు విక్రయాలను మంత్రి లక్ష్మీ దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించి మాట్లాడారు. పేదలు ఆనందంగా జీవించాలనే ఆలోచనతోనే సబ్సిడీ ధరలపై బియ్యాన్ని కిలో రూ.48లకు, కందిపప్పు కిలో రూ.160లకు విక్రయించడం జరుగుతున్నదన్నారు. కూరగాయల ధరలు తగ్గించే చర్యలు త్వరలోనే చేపడతామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నిత్యావసరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతున్నదని, ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు సాధారణ స్థితికి వచ్చే వరకూ రైతు బజార్లలో కందిపప్పు, సూపర్‌ఫైన్ రకం బియ్యం విక్రయించడం జరుగుతుందన్నారు. ఒక్కొక్కరికీ కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యం విక్రయిస్తారన్నారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా తేవాలన్నారు. విక్రయాలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. డిమాండ్ ఉంటే రైతుబజార్లలోనే కాకుండా మరిన్ని పాయింట్లలో విక్రయ కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు విక్రయాలపై పర్యవేక్షణ చేస్తామని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్, అర్బన్ తహశీల్దార్ ఆంజనేయులు, ఏఎస్‌వో నాగాంజనేయులు, ఏడీఎం సునీల్ వినయ్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.శ్రీనివాస్, ఎంఎస్‌వోలు నాగలక్ష్మి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న 7 లారీలు సీజ్



నిడదవోలు, జూలై 11 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకువచ్చినప్పటికి అక్రమార్కులు అనధికారికంగా ఇసుక రవాణా చేస్తూనే ఉన్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో దాడి చేసి 7 లారీలను సీజ్ చేసినట్టు నిడదవోలు ఎస్ఈబీ సీఐ దొరబాబు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి గోపాలపురం ఇసుక రీచ్ నుంచి 7 లారీలలో 150 టన్నుల ఇసుకను ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తుండగా పెరవలి సమీపంలో పట్టుకున్నా మన్నారు.అనుమతులు లేకపోవడంలో లారీలను సీజ్ చేశామని తెలిపారు. ఆయన వెంట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది ఉన్నారు.

విలీనం కాక.. నిధులు రాక

10 గ్రామాల విలీనానికి మోకాలడ్డిన వైసీపీ

- రాజమహేంద్రికి మహా మోసం
- ఐదేళ్లూ విలీన ఊసెత్తని వైసీపీ
- వద్దంటూ మాజీ మంత్రి వేణు లేఖ
- నాటి కలెక్టర్ మాధవీలత ఆమోదం
- మహానగరం కాలేకపోయిన రాజమండ్రి
- కేంద్రం నిధులు హుష్‌కాకి
- అయినా పట్టించుకోని నాటి పాలకులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 11 : రాజమహేంద్రవరాన్ని మహానగరంగా మార్చేందుకు పది గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదనలకు రాష్ట్ర గవర్నర్ ఆమోదముద్రవేసి ఆర్డినెన్స్ జారీ చేశారు. అయితే గవర్నర్ ఆదేశాలను సైతం గత ప్రభుత్వం పక్కనపెట్టి గ్రామాల విలీనానికి వ్యతిరేకంగా అప్పటి కలెక్టర్ డాక్టర్ మాధవీలత తీర్మానం చేసి సీడీఎంఏకు పంపిన సంగతి బహుషా ఎవరికీ తెలియకపోవచ్చు. ఎందుకంటే అదంతా చాలా సైలెంట్‌గా జరిగిపోయింది. రాజమహేంద్రవరాన్ని మహానగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 24 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. అయితే ఆయా గ్రామాల నుంచి ఒకరిద్దరు న్యాయస్థానాలకు వెళ్లడంతో ఆ సంఖ్య పది గ్రామాలకు చేరింది. గ్రామాల విలీనానికి అవసరమైన ప్రక్రియ అంతా పూర్తి చేయ డంతో రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలిపారు. తీరా అన్ని పనులు పూర్తయ్యే సరికి వైసీపీ ప్రభుత్వం దీనికి మోకాలడ్డింది.

విలీనం వద్దని మాజీ మంత్రి వేణు లేఖ

రాజమహేంద్రవరంలో పది గ్రామాలు విలీనం కావడం ద్వారా నగర విస్తరణ మరింతగా పెరిగి ప్రస్తుతం ఉన్న జనాభా 5 లక్షలకు మరొక లక్షా 50 వేల మంది కలిసి సుమారుగా 6 నుంచి 7 లక్షల మంది జనాభాతో రాజమహేంద్రవరం పెద్దనగరంగా అవతరించే అవకాశం ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల విలీనం అంశం తెరపైకి వచ్చినట్టే వచ్చి మళ్లీ వెనక్కిపోయింది. వైసీపీ హయాంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రాజమహేంద్రవరంలో పది గ్రామాల విలీన ప్రక్రియను వ్యతిరేకించారు. దానికి కారణం ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిధులు గ్రామాలకు రావని అందువల్ల విలీనాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఒక లేఖను కలెక్టర్‌కు పెట్టారు. అప్పటివరకు గ్రామాల వీలీనం చేసేద్దామని అన్ని చర్యలు చేపట్టిన అప్పటి అధికార యంత్రాంగం ఒక్కసారిగా వాటిని నిలుపుదల చేసింది. పైగా గ్రామాల విలీనాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని డీపీవోతో డీలిమిటేషన్ ప్రతిపాదనలు పెట్టించారు. నగరపాలక సంస్థ పాలక మండలి లేకపోవడంతో సుప్రీం అథారిటీ కింద కలెక్టర్ దానిని కౌన్సిల్ రిజల్యూషన్ చేయించారు. అక్కడ నుంచి దానిని సీడీఎంఎ(కార్పొరేషన్ డైరెక్టర్ అండ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్)కు పంపించారు. దానిని ప్రభుత్వం ఆమోదించాల్సి ఉండగా ఎన్నికలు వచ్చేశాయి. దీంతో పెండింగ్‌లో ఉంది.

నష్టపోతున్న రాజమహేంద్రవరం

రాష్ట్రంలో అతిపెద్ద నగరాలుగా విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం ఉన్నాయి. వాటితో పాటు సమానంగా నిలవాల్సిన రాజమహేంద్రవరం వాటి సరసన నిలిచే అవకాశంలేకుండా వెనకడుగు పడుతోంది. ఎటు చూసిన పది కిలోమీటర్ల సిటీ పరిధి లేకుండా రాజమహేంద్రవరం ఉండడం శాపంగా మారుతోంది. రాజమహేంద్రవరంలో వేమగిరి,ధవళేశ్వరం, బొమ్మూరు, హుక్కుంపేట, శాటిలైట్ సిటీ, పిడింగొయ్యి, రాజవోలు, కాతేరు, తొర్రెడు, వెంకటనగరం గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదనకు గవర్నర్ రాజముద్ర వేశారు. కానీ గత ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరించింది. రాజమహేంద్రవరం ప్రస్తుత విస్తీర్ణం 44 చదరపు కిలోమీటర్లు ఉంది. ఇందులో సుమారు 22 చదరపు కిలోమీటర్లు గోదావరి నదిలో ఉండగా మిగిలింది 22 మాత్రమే. గ్రామాల విలీనం జరిగితే విస్తీర్ణం పెరిగి నగరం మరింతగా పెరుగుతుంది. నగర వైశ్యాలంను బట్టి నగరాలకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఈ కేటాయింపులో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాలతో పోల్చితే 50 శాతం రావడంలేదు. అందుకే గ్రామాల విలీనం చేయాల్సిన బాధ్యత కూటమిపై ఉంది.

వ్యవసాయాధికారులేరి?

గోకవరం, జూలై11: ఒక పక్క జోరు వర్షాలు.. మరో పక్క మొదలైన వ్యవసాయ పనులు. ఇటువంటి సమయంలో రైతులకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పత్తా లేకుండా పోతున్నారు. ఫోన్‌లకూ దొరకడంలేదు. వ్యవసాయపరమైన సమస్యలను అడిగి తెలుసుకునేందుకు కార్యాలయానికి వెళుతుంటే అక్కడ ఏ ఒక్క అధికారి జాడ కానరావడంలేదని రైతాంగం వాపోతున్నారు. ఇలా ఒకసారి, రెండుసార్లు కాదు.. వారంలో నాలుగైదు రోజులు ఇలాంటి పరిస్థితే ఎదురవుతుందని బాధిత రైతులు మండిపడుతున్నారు. గోకవరం మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి అందే వ్యవసాయపరమైన సహాయ, సహకారాలు పొందేందుకు, ఎరువులు, ఇతర అవసరాల నిమిత్తం మండల వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళుతుంటే అక్కడ అధికారులు కనిపించక రైతులు లబోదిబోమంటున్నారు. ఒకవేళ అధికారులు ఏదొక సమయంలో వస్తారని కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూస్తున్నా వారి దర్శనభాగ్యం మాత్రం కలగడం లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారిణి మాట ఎలా ఉన్నా కిందిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండడంలేదని విమర్శిస్తున్నారు. కోరుకొండ, రాజమహేంద్రవరంలలో సమావేశాలంటూ సంబంధిత అధికారులు నిత్యం కార్యాలయానికి డుమ్మా కొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పాలకులు వ్యవసాయ శాఖ సిబ్బంది తీరును పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.



గురువారమైనా తెరుచుకోని వ్యవసాయ శాఖ కార్యాలయం

12 డైరెక్టర్ పదవులకు 66 మంది నామినేషన్లు

రసవత్తరంగా అర్బన్ బ్యాంక్ ఎన్నిక

రాజమహేంద్రవరం, జూలై11(ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు రసవత్తంగా మారనున్నాయి. 12 డైరెక్టర్ పదవులకు గురువారం ఏకంగా 66 మంది నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ కూటమి ప్యానల్ చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ ప్యానల్‌కు ఎంపికైన మిగతా 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ మద్దతుదార్లుగా అనేక మంది ఇష్టానుసారం నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం. మొత్తం ఆర్యాపురం బ్యాంక్ పరిధిని మూడు నియోజకవర్గాలుగా విభజించారు. ఒకటో నియోజకవర్గంలో ఆర్యాపురం మెయిన్ బ్రాంచి, కోటగుమ్మం, తాడితోట, కాతేరు, స్వరాజ్యనగర్,జెఎన్‌రోడ్, బొమ్మూరు, దానవాయిపేట బ్రాంచిలు ఉంటాయి. వీటి పరిధిలో ఓటర్లు 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు.ఈ నియోజకవర్గంలో 10 డైరెక్టర్ పదవులకు 62 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండో నియోజకవర్గం కింద కాకినాడ,తాడేపల్లిగూడెం, తణుకు బ్రాంచిల పరిధిలో ఒక డైరెక్టర్ పదవి ఉంది. నడకుదురుకు చెందిన సింగంపల్లి వెంకట రామకృష్ణ ఒకరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైంది. 13వ తేదీన అధికారికంగా ప్రకటిస్తారు. మూడో నియోజకవర్గం కింద దివాన్ చెరువు, భీమవరం, అమలాపురం, వైజాగ్(సీతమ్మధార), గుంటూరు బ్రాంచిల పరిధిలో ఒక డైరెక్టరును ఎన్నుకుంటారు. కానీ ఇక్కడ ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో టీడీపీ కూటమి ప్యానల్‌కు చెందిన దివాన్‌చెరువు వాసి నీలపాలన సూర్యసత్యనారాయణతో పాటు దివాన్‌చెరువుకు చెందిన మరొకరు, అమలాపురానికి చెందిన ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన తర్వాత 13 ఉపసంహరణ గడువు ఇస్తారు.అదేరోజు ఫైనల్ లిస్ట్ ప్రకటిస్తారు. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేస్తే 20న పోలింగ్ జరగే అవకాశం ఉంది. టీడీపీ కూటమి ప్యానల్‌తో పాటు వైసీపీ కూడా ప్యానల్‌ను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. రెండు డైరెక్టర్ పదవులకు సీపీఐ నుంచి జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు.

గోపాలపురంలో అత్యధిక వర్షపాతం నమోదు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 11: జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమొదరు జల్లులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. గడచిన 24 గంటల్లో గోపాలపురంలో అత్యధికంగా 10 మి.మీ వర్షపాతం నమోదైందని వాతవరణ శాఖ తెలిపింది. అత్యల్పంగా దేవరపల్లిలో 1.0 మి.మీ వర్షకురిసింది. అనపర్తిలో 2.4 మి.మీ, బిక్కవోలు 1.2 మి.మీ, కోరుకొండలో 9.0 మి.మీ, రంగంపేటలో 5.4 మి.మీ, సీతానగరంలో 2.6 మి.మీ, తాళ్ళపూడిలో 1.4 మి.మీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో వాతావరణం పొడిగా ఉంది. గురువారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపాడు. జనం ఉక్కబోతకు గురయ్యారు.



సీఎస్ఈ క్రేజ్




అమలాపురం రూరల్, జూలై 11:

ఐటీ..మేటీ

దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఐటీ సెక్టార్ సంక్షోభంలో ఉంది. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఐటీ సెక్టార్ ఏర్పాటు చేయకపోవడంతో మూడేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌తో పాటు అనుబంధ విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. అక్కడి నుంచే ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవాల్సిన పరిస్థితిని గత జగన్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఇంజనీరింగ్ చదవాలనుకునేవారి సంఖ్య అంతకంతకూ పెరగడం ఒకెత్తు కాగా సంక్షోభంలో ఉన్న ఐటీ సెక్టార్‌లోనే చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు. కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిందా సరే లేదంటే లక్షలు వెచ్చించి అయినా మంచి కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు తహతహలాడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరొందిన కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్‌కు ఎంత డిమాండు ఉందో వాటి అనుబంధ విభాగాల ఇంజనీరింగ్ విద్యకూ అదే డిమాండు కొనసాగుతోంది. పేరొందిన కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ సీటు మేనేజ్‌మెంట్ కోటాలో పొందాలంటే రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు పలుకుతోంది. పక్క జిల్లాలోని భీమవరంలోని ఓ కళాశాలలో అయితే అదే సీటు రూ.14లక్షలు పైబడే వుంది.

ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నా..
కంప్యూటర్ సైన్స్‌పైనే మక్కువ
మేనేజ్‌మెంట్ కోటా సీటుకైనా సిద్ధం
రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఫీజు
ఉమ్మడి జిల్లాలో కంప్యూటర్ సైన్స్
అనుబంధ విభాగాల్లో 9,985 సీట్లు



సీట్లు..కళాశాలలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 23 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో మొత్తం సీట్లు 14,520. ప్రభుత్వ పరిధిలోని కాకినాడ జేఎన్టీయూతో పాటు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మొత్తం 780 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రధాన విభాగాలకు సంబంధించి 50 నుంచి 60 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక మిగిలిన 20 ప్రైవేటు కళాశాలల్లో 13,740 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ కళాశాలల్లో ఐటీ విభాగానికి సంబంధించి అదనంగా 60 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. కంప్యూటర్ సైన్స్‌పై విద్యార్థులు విపరీతంగా క్రేజ్ పెంచుకున్నారు. అందుకు అనుగుణంగానే పలు కళాశాలల్లో సీఎస్ఈ, అనుబంధ ఇంనీరింగ్ కోర్సులను మాత్రమే కలిగి ఉండడం విశేషం. కోరంగిలో మూడు ఇంజనీరింగ్ కళాశాలల పేరిట కంప్యూటర్ సైన్స్ కోర్సులను మాత్రమే అనుమతి పొందారు. మిగిలిన ఇతర ఇంజనీరింగ్ కోర్సులేవీ అక్కడ లేవు. సీఎస్ఈ, ఏఐడీఎస్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ఇంజనీరింగ్ కోర్సులకు మాత్రమే అనుమతి పొందారు. ఒక్కో కళాశాలలోను 540 నుంచి 780 సీట్లు ఉన్నప్పటికీ అవన్నీ కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాలకు చెందినవే. సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి మొత్తం 2,160 సీట్లు ఉండగా కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న కోర్సుల్లో 1,560 సీట్లు కేటాయించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 14,520 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాలకు 9,985 సీట్లు ఉన్నాయి. ఇక మిగిలిన 4,535 సీట్లు ఈసీఈ, ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఫుడ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలకు ఉండడం విశేషం.

సీఎస్ఈకి ఫుల్ డిమాండ్

ఐదేళ్ల క్రితం వరకు ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ) మాత్రమే ఐటీ విభాగంలో ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా మరికొన్ని ఇంజనీరింగ్ కోర్సులను ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చి ప్రోత్సహించారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి ఇంజనీరింగ్ కోర్సులు కొత్తగా వచ్చి చేరాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే వారిలో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్‌నే ఎంచుకుంటున్నారు. కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న డేటా సైన్స్, ఐటీ, ఇతర విభాగాలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించిన ఈఏపీసెట్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇంజనీరింగ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎందరో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారు. అటువంటి వారంతా ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యా సంస్థల్లో చేరేందుకు సిద్ధపడ్డారు. కాకినాడ జేఎన్టీయూ, రాజమహేంద్రవరంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయాల్లో కంప్యూటర్ సైన్స్, ఐటీ సెక్టార్‌లో సీట్ల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఆయా ప్రభుత్వ కళాశాలల్లో అంతంతమాత్రంగానే సీట్లు ఉండడం వారిని నిరాశ పరుస్తోంది. ఐటీ రంగంలో ఉద్యోగం పొందాలంటే కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నప్పటికీ ఆ రంగంలోనే ఎక్కువగా ఉద్యోగాలు పొందే పరిస్థితి కనిపిస్తోంది. తొలుత తక్కువ ప్యాకేజీలో ఉద్యోగంలో చేరినా ఆ తర్వాత అనుభవంతో పాటు కొత్త కోర్సులు నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని భావించి విద్యార్థులు కంప్యూటర్ సైన్స్‌పైనే ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఇచ్చారు. 13న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంది. 16వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇక 17 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించాలని ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాలలకు ఆదేశాలు అందాయి.



అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్టు

ద్రాక్షారామ, జూలై 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో పోలీసులు బుధవారం ఒక మైనరు సహా ఐదుగురిని అరెస్టు చేశారు. వెల్ల గ్రామానికి చెందిన మైనరు బాలుడుతో సహా యర్రంశెట్టి త్రిమూర్తులు అలియాస్ తరుణ్, చిక్కాల వీరమణికంఠ అలియాస్ మణి, వేపూరి వీర వెంకటసత్యనారాయణ అలియాస్ నాని, ఈత రామచంద్రుడు అలియాస్ రాము, సిరిగినీడి దుర్గాప్రసాద్ అలియాస్ డి.పిలను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. డీఎస్పీ బి.రామకృష్ణ రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద జగనన్నకాలనీలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ధ్వంసం చేస్తే వేరొక ప్రాంతంలో పెట్టుకుంటారని పథకం ప్రకారం ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి విగ్రహాలు పరిసర ప్రాంతంలో మద్యం సేవించారు. నిందితులు గునపంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొట్టి నేలకూల్చారు. విగ్రహం కిందపడినప్పుడు శబ్దం వచ్చి అలికిడి కావడంతో ఎవరైనా వచ్చి చూస్తారనే భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. వీరికి నేరంలో ఎప్పటికప్పుడు సమాచారం అందచేసి వారు తప్పించుకునేందుకు సిరిగినీడి దుర్గా ప్రసాద్ అలియాస్ డి.పి సహకరించారు. ఈ ఘటనపై ద్రాక్షారామ పోలీసుస్టేషన్‌లో ఈనెల 5న కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఖాదర్ బాషా పర్యవేక్షణలో సీఐ దొరరాజు సర్కిల్‌లో ఎస్ఐలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టామన్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సమగ్ర దర్యాప్తు చేశామన్నారు. నేరానికి ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్లు, గునపం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ, సీఐ ఎస్ఐలు సురేంద్ర, జానీభాషా సురేష్‌బాబు, చైతన్య సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

విద్యార్థినిని కత్తితో బెదిరించిన ఆగంతకుడు

కొత్తపేట, జూలై 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి శివారు చప్పిడివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం బాత్రూమ్‌కు వెళ్లగా ఓ ఆగంతకుడు కత్తితో బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. బాలిక అతడిని వదలించుకుని కేకలు వేయడంతో ఉపాధ్యాయులు వెళ్లేసరికి ఆగంతకుడు గోడదూకి పరారయ్యాడని తెలుస్తోంది. షార్ట్, టీషర్ట్ వేసుకుని పెద్ద జుట్టుతో ఉన్న యువకుడిగా విద్యార్థిని గుర్తించింది. దీనిపై కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్‌కు పాఠశాల హెచ్ఎం కుంచే అరుణశ్రీ ఫిర్యాదు చేశారు. ఎంఈవో ఎం.హరిప్రసాద్, డీవైఈవో వెళ్లి బాలికను విచారించారు. ఎస్ఐ వివరాలు తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వీసాల పేరుతో మోసం..కేసు నమోదు

పి.గన్నవరం, జూలై 11: మస్కట్ దేశంలో అగ్రిమెంట్ కంపెనీ వీసాలు పేరుతో మోసగించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగుల్లంకకు చెందిన ఉంద్రాజవరపు సురేష్ ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లాలనుకున్నాడు. మార్చి నెలలో రాజోలుకు చెందిన గుబ్బల దుర్గాప్రసాద్, శ్రీనులు సురేష్‌కు పరిచయమై మస్కట్ దేశంలో ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలున్నాయని రూ.2 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో సురేష్ ఏప్రిల్ 4న మస్కట్ బయలుదేరగా ఎయిర్‌పోర్టు తనిఖీల్లో టూరిస్ట్ వీసాగా గుర్తించారు. ఈ విషయాన్ని ఏజెంట్లకు సూచించగా, మస్కట్‌లో తమ వాళ్లు ఉన్నారని ఇబ్బందులు ఉండవని చెప్పారు. దీంతో మస్కట్‌కు వెళ్లిన సురేష్ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. తల్లి వెంకాయమ్మ ఏజెంట్ల వద్దకు వెళ్లి తన కుమారుడు ఇబ్బందులు పడుతున్నాడని, ఇండియాకు తిరిగి రప్పించాలని కోరింది. రూ.లక్ష ఇస్తే వెనక్కి రప్పిస్తామని ఏజెంట్లు డిమాండ్ చేశారు. దీంతో వెంకాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ పీవీవీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటక రంగ పూర్వ వైభవానికి కృషి చేయాలి

ప్రముఖ రంగ స్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ


గుమ్మడి గోపాలకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 11: నాటక రంగం పూర్వ వైభవానికి కలిసికట్టుగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గురువారం రాత్రి సినిమా రోడ్డులో సూర్య కళా మందిరం అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో భాగంగా తొలుత మలిసంధ్య అనే నాటిక ప్రదర్శించారు. కుటుంబ బాంధవ్యాలు ఏ విధంగా ఉండాలి అనే అంశం ప్రధాన ఇతివృత్తంగా నాటిక ప్రదర్శన జరిగింది. అనకాపల్లి శ్రీ షిర్డీ సాయి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. జి.సుబ్బలక్ష్మీ మూల కథ రాయగా, పొన్నాడ ముత్యాలరావు దర్శకత్వం వహించారు. అనంతరం నిర్వాహకులు గోపాలకృష్ణ తదితరులకు మెమెంటో అందించి సత్కరించారు. కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుత రామారెడ్డి, పంపన దయానంద బాబు పాల్గొన్నారు.


మలిసంధ్య నాటికలో ఓ సన్నివేశం

టోలిన్ లిక్విడ్ ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన ట్యాంకర్

పెద్దాపురం, జూలై 11 : పెద్దాపురం ఏడీబీ రహదారిలో గురువారం తెల్లవారుజామున అత్యంత ప్రమాదకరమైన టోలిన్ లిక్విడ్‌తో వెళుతున్న ట్యాంకర్ బోల్తా పడింది. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే రక్షణ చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలం వద్ద మూడు అగ్నిమాపక శకటాలను సిద్ధం చేశారు. జన సంచారం లేని ప్రదేశం కావడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే ట్యాంకర్‌లో ఉన్న 11 టన్నుల లిక్విడ్ టోలిన్ గాల్లో కలిసిపోయిందని అధికారులు తెలిపారు. ట్యాంకర్‌లో ఉన్న మిగిలిన లిక్విడ్‌ను ఎయిర్‌ప్రెజర్ ద్వారా మరో ట్యాంకర్‌లోకి డంప్ చేశారు. సంఘటన జరిగిన రహదారిలో పోలీసులు ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. ఏడీఎఫ్‌వో ఎం.శ్రీహరిజగన్నాథ్, ఎస్ఐ వెలుగుల సురేష్ సంఘటనా స్థలం వద్ద ఉండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

రైళ్లల్లో దొంగతనాలు

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

తుని రూరల్, జూలై 11:కదులుతున్న రైళ్లలో, ఏసీ బోగీల్లో, స్లీపర్ బోగీల్లో నిద్రిస్తున్న ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు దొంగలించిన వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైళ్లలోని నిఘా కెమెరాల ఆధారంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపపల్లికి చెందిన 23 ఏళ్ల సేనాపతులు మనీష్ కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 190 గ్రాముల బంగారు ఆభరణాలు, వీటి విలువ రూ.12 లక్షలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. తుని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విజయవాడ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అబ్దుల్‌మారుఫ్‌తోపాటు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రామకోటి, శివసురేష్, ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు, ఏఎస్ఐ గోవిందరావులను రైల్వే ఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో గోదావరిలోకి దూకిన వ్యక్తి

కాపాడిన ఫైర్ కానిస్టేబుల్


బయటకు తీసుకువస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 11: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యా యత్నం చేసిన వ్యక్తిని కొవ్వూరు ఫైర్ కానిస్టేబుల్ రక్షించాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటరమణమూర్తి 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నిద్ర లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి ఈ నెల 11వ తేదీ రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది స్కూబా డ్రైవ్ మాస్టర్, స్విమ్మింగ్ ట్రైనర్ ఎం.ప్రకాష్‌బాబు రెస్క్యూ బోట్‌తో హుటాహుటిన నదిలోకి వెళ్లి వెంకటరమణమూర్తిని రక్షించి బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణమూర్తిని రక్షించిన ప్రకాష్‌బాబును ఫైర్ అధికారి ఏబీఎస్ఎస్ వేణు అభినందించారు.


కానిస్టేబుల్ ప్రకాష్

గతంలో పనిచేసిన

ముమ్మిడివరం సీఐపై కేసు

ముమ్మిడివరం, జూలై 11: ముమ్మిడివరంలో గతంలో సీఐగా పనిచేసిన ఎం.జానకీరామ్‌పై ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో 227/2024గా ఎఫ్ఐఆర్ నమోదైంది. ఒక సివిల్ వివాదం కారణంగా ఒక వ్యక్తికి మేలు చేకూర్చే విధంగా సీఐ వ్యవహరించారనే అభియోగంపై ఈ ఎఫ్ఐఆర్ నమోదైనట్టు సమాచారం. ముమ్మిడివరంలోని సర్వే నంబరు 518లో 3ఎకరాల 16 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ముమ్మిడివరానికి చెందిన పోలిశెట్టి రాజేష్‌కుమార్‌కు మరికొందరికీ మధ్య చాలాకాలంగా సివిల్ వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూమికి సంబంధించి అమలాపురానికి చెందిన పిల్లా రమేష్‌కు పార్టీషన్ డీడ్ రాయించాడని, మల్లప శివరామకృష్ణ 2009లో మృతిచెందితే 2019లో మల్లప శివరామకృష్ణ వీలునామా ఎలా బయటికి వచ్చిందని, రాజేష్‌కుమార్ 2018 డిసెంబరు 13న ముమ్మిడివరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో పోలిశెట్టి రాజేష్‌కుమార్ చేసిన ఆర్టీఐ అప్లికేషన్‌కు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌వో 2019లో ఒక అన్ రిజిష్టర్ వీలునామా ఇచ్చారని మరలా రాజేష్‌కుమార్ ఫైల్ చేసిన ఆర్టీఐ అప్లికేషన్‌కు అప్పటి సీఐ ఎం.జానకీరామ్ నోటరైజ్డ్ వీలునామా ఇచ్చారని పోలీసు రికార్డుల్లో అన్ రిజిష్టర్డ్ వీలునామాను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నోటరైజ్డ్ వీలునామాగా మార్చి పిల్లా రమేష్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాడని పోలిశెట్టి రాజేష్‌కుమార్ ఆరోపించారు. ఈ అభియోగంపై సీఐ జానకీరామ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా కోర్టు ముమ్మిడివరం పోలీసులను ఆదేశించినట్టు సమాచారం.

ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు

గొల్లప్రోలు రూరల్, జూలై 11: గొల్లప్రోలు మండలం మల్లవరం ఆర్‌ఆర్‌బీ చెరువులో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గాలింపు చర్యలు కొనసాగించాయి. మండలంలోని ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర పశువులు మేపేందుకు 7వ తేదీ సాయంత్రం మల్లవరంలోని ఆర్‌ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చునని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా కలెక్టరు సూచనల మేరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. రాత్రి వరకూ వృద్ధుడి ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. యువకుడి మృతి

రాజానగరం, జూలై 11: మండలంలో పరిజెల్లిపేట సమీపంలోని చాగల్నాడు కాలువ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. తోకాడ గ్రామానికి చెందిన నల్లమిల్లి సందీప్(20), అతడి స్నేహితుడు గండి వీరవెంకట సత్యనారాయణ కలిసి మోటార్‌సైకిల్‌పై రాజానగరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో చాగల్నాడు కాలువ సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్ కింద పడిపోవడంతో లారీ అతడి పైనుంచి దూసుకుపోవడంతో శరీర భాగాలు చెల్లాచెదురై అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓ లారీలో రవాణా చేస్తున్న గంజాయిని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ వివరాలను వెల్లడించారు. దివాన్ చెరువు జంక్షను వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా కాకినాడ నుంచి రాజస్థాన్ వెళ్తున్న ఓ లారీలో 153 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. సీరారామ్, గోమద్‌రామ్ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో కాకినాడ రూరల్ సర్పవరంలో మరో 200 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. అక్కడ తిమ్మాపురానికి చెందిన కోటిబోయిన ప్రసాద్, ఒడిసాకు చెందిన ప్రతాప్ మండల్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం రూ.20 లక్షలు విలువ చేసే 353 కిలోల గంజాయి, రూ.6 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి రవాణాకు కారణమైన రాజస్థాన్‌కు చెందిన రామ్‌నివాస్, సందీప్ అనే వ్యక్తులను కూడా అరెస్టు చేశామని చెప్పారు.

అన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం


విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 11: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం బెంగుళూరుకు చెందిన ఐ.రామ్మోహన్, రమాసుందరి దంపతులు రెండు లక్షలు, సత్యదేవా గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ 50 వేలు విరాళంగా సమర్పించారు. దాత ఈమొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన వై.రాధాకృష్ణ అన్నదాన పథకానికి రూ 1,00,116లు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

'సంతాల్ తిరుగుబాటు స్ఫూర్తిగా ఆదివాసీలు పోరాడాలి'



ర్యాలీలో అఖిల భారత రైతుకూలీ, ఆదివాసీ సంఘ నాయకులు

వై.రామవరం, జూలై 11: సంతాల్ తిరుగుబాటును స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మరి పాలెం గ్రామంలో గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాల్ ఆదివాసీ తిరుగుబాటును స్మరించుకుంటూ గ్రామంలో సభ నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్‌తో పాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్తిబాబు, బి.వెంకటనాయుడు, జిల్లా నాయకులు పండేల సోమన్న, మండెల పాపన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు. బ్రిటిషు వలస పాలకులకు వ్యతిరేకంగా 1855 జూన్ నెలలో సంతాల్ తిరుగుబాటు జరిగిందని ఈ పోరాటాన్ని ఆదివాసీలు తమ హక్కుల సాధన కోసం స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఫారెస్టు ఏరియాలో ఉన్న ఖనిజ సంపదలను సామ్రాజ్యవాద కంపెనీలకు అప్పజెప్పడానికి గిరిజనులను అడవుల నుంచి ఖాళీ చేయించడానికి ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఇటువంటి చర్యలను గిరిజనులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిల్లా రామయ్యమ్మ, సుంద్రు కాసులమ్మ, ఉయ్యాల చినవీరయ్య, పెదవీరయ్య, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చి
పునరావాసం కల్పించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఎటపాక, జూలై 11: 2022 జూలైలో సంభవించిన గోదావరి వరదకు ముంపునకు గురైన ప్రతీ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి, పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం నందిగామ గ్రామంలో కాకా అర్జున్ అధ్యక్షతన పోలవరం నిర్వాసితుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఐవీ మాట్లాడారు. గతంలో ఎకరాకు రూ.1.15 లక్షలు పొందిన భూములకు అదనంగా రూ.10 లక్షలు కలిపి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరానికి భూములు ఇచ్చిన పొలాలకు ఈకేవైసీ నిర్వహించి, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలన్నారు. నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం మారినా ప్రాజెక్టు తప్పా, నిర్వాసితులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రానున్న వరదల్లో ముంపు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ ఇంగిలపు బేబి, సీపీఎం నాయకులు సొందే రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం గుర్తింపు



ఎటపాక, జూలై 11: గుర్తుతెలియని ఓ వృద్ధురాలు మృతి చెందింది. భద్రాచలం సరిహద్దులో, పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలో దేవస్థానం భూముల్లో ఆమె మృతదేహాన్ని గురువారం గుర్తించారు. సుమారు 60 ఏళ్ల ఉన్న వృద్ధురాలు జామాయిల్ తోటలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ పార్థసారథి సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. వృద్ధురాలు చనిపోయి దాదాపు రెండు రోజులు కావచ్చునని, మృతదేహం పాడై దుర్వాసన వస్తోందని పోలీసులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నేత



రంపచోడవవరం, జూలై 11: గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని రంపచోడవరం టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్ గురువారం సాలూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక



కడియం, జూలై 11: కడియం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు తాండ్ర హేమ (576 మార్కులు), జక్కల భాను ప్రకాష్ (556 మార్కులు) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యమైన ఎరువులు ఇవ్వండి

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- సబ్‌డివిజన్ పరిధిలో డీలర్లతో సమావేశం
- పలు శాఖల అధికారులతో సమీక్షలు

కోరుకొండ, జూలై 11: నియోజకవర్గంలోని రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఎరువుల డీలర్లకు సూచించారు. కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం కోరుకొండ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలకు చెందిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో రైతులకు ప్రతి ఎకరాకు అవసరమైన సాగునీరు రెండు పంటలకు సకాలంలో సక్రమంగా అందిస్తామని, దానికి తోడు డీలర్లు అందరూ రైతులకు మంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలన్నారు. గతంలో వ్యవసాయ యంత్రాలను గ్రూపులకు అందజేసేవారని, అయితే ప్రస్తుతం రైతులకు అవసరమైన యంత్రాలు వ్యక్తిగతంగా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను డీలర్లు సత్కరించారు. వారం రోజులుగా జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులపై విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్న నేపథ్యంలో కోరుకొండలో ఈ సమావేశం జరగడం చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కాకి మాధవరావు, ఏడీఏ మల్లికార్జునరావు, ఎంపీడీవో హేమసుందరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గాదరాడ, శ్రీకృష్ణపట్నంలో పీహెచ్‌సీలు

ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బత్తుల తన కార్యాలయంలో ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పద్మ, ఇతర వైద్యాధికారులతో రాజానగరం నియోజకవర్గంలోని ప్రభుత్వాసుపత్రుల ప్రగతిపై సమీక్షించారు. త్వరలో కోరుకొండ, రాజానగరం పీహెచ్‌సీలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లుగా అభివృద్ధి చేస్తామన్నారు. పీహెచ్‌సీల్లో నూతన వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. గాదరాడ, శ్రీకృష్ణ పట్నంలలో నూతన పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న మూడు 108 అంబులెన్స్‌లు సరిపోవని వాటి సంఖ్య పెంచేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. తాను సొంతంగా నాలుగు అంబులెన్స్‌లను ఉచితంగా నడుపుతున్నామన్నారు. ట్రాన్స్‌కో అధికారులతో నిర్వహించిన సమీక్షలో విద్యుత్‌శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ముక్కినాడ, నన్నయ యూనివర్శిటీల్లో కొత్తగా ప్రతిపాదించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని లోటల్టేజ్ నియంత్రించడానికి 104 కొత్తట్రాన్స్‌ఫార్మర్‌ల అవసరం ఉందని వాటి మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రతిపాదించే రోడ్డు పనుల్లో అత్యవసరమైనవి గుర్తించి వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు ఒకేసారి చేపట్టేలా చూడాలన్నారు. సమీక్షల్లో విద్యుత్ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, డీఈఈలు చిట్టిరాజు, సన్యాసిరావు, ఏఈలు చిన్నారి లక్ష్మి, సుబ్రహ్మణ్యం, మదర్‌సా, చంద్రమోహన్, డ్వామా పీడీ మునిలింగం, డీఈ రవి, ఏఈలు పాల్గొన్నారు.


దివాన్‌చెరువు: రైతుబజారులో బియ్యం, కందిపప్పు విక్రయాలు ప్రారంభిస్తున్న బత్తుల


జిల్లా వైద్యశాఖాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

బియ్యం, కందిపప్పు చౌకగా అందించడమే లక్ష్యం

దివాన్‌చెరువు, జూలై 11: పేదలకు బియ్యం, కందిపప్పు చౌకధరలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డులోని రైతుబజారులో ప్రభుత్వ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. నాణ్యమైన బియ్యం, కందిపప్పు ప్రజలకు అందుబాటు ధరలలో విక్రయించడానికి ఈ కేంద్రం ప్రారంభించామన్నారు. కౌంటరులో కూర్చుని వినియోగదారులకు సరుకులు అమ్మి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్డ పక్కన టీ అమ్ముకుని జీవిస్తున్న చిరు వ్యాపారి చిపూరి సూర్య విజయలక్ష్మి వద్దకు వెళ్లి కుటుంబ ఆర్థిక పరిస్థితులును, వ్యాపారం గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తానే స్వయంగా టీకాచి కస్టమర్లకు అందించారు. కార్యక్రమాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో ఆలోచనా విధానం మెరుగు


పోటీల్లో పాల్గొన్న అంధ విద్యార్థిని మెడల్‌తో సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

- ఎమ్మెల్యే నల్లమిల్లి.. ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు

అనపర్తి, జూలై 11: చందరంగం క్రీడ ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నెస్కో సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెస్కో స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ ఛైర్మన్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే అనపర్తి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన దివ్యాంగుడు, రాజమహేంద్రి పాఠశాల విద్యార్థి ఇశ్వంత్‌ను ఎమ్మెల్యే మెడల్‌తో సత్కరించారు. అండర్-10 అండర్-15 విభాగాల్లో జరుగుతున్న చెస్ పోటీల్లో 285 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేశారు. పోటీలు రాత్రి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరించారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ

మండలంలోని రామవరం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ముందుగా పాఠశాల వ్యవస్థాపకుడు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలలో ఉన్నత విద్యావసరాన్ని గుర్తించిన మూలారెడ్డి అనేక ఉన్నత పాఠశాలల నిర్మాణాలను చేపట్టి విద్యాదాతగా నిలిచారన్నారు. ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగా భవాని, నాయకులు తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తేనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగాలపేట ముంపునకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 11: వర్షాకాలంలో వర్షపు నీరు, మురుగు నీటిని వేరు చేసేవిధంగా రెండు పంపింగ్ స్కీమ్‌లను నిర్మించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 41వ డివిజన్ కోటిలింగాలపేటలోని వేస్టేజ్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను గురువారం ఉదయం ఆయన, జిల్లా ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ దినేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. కోటిలింగాలపేటలో వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చేపట్టేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్కీమ్‌ను 2014లో అప్పటి ప్రభుత్వం పుష్కరాల సమయంలో నిర్మించిందన్నారు. అయితే 2014 నుంచి 2019 మధ్యలో రెండో పంపింగ్ స్కీమ్ నిర్మిస్తే కోటిలింగాల ప్రాంతవాసుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అప్పటి కార్పొరేటర్ ప్రతిపాదన చేసినా పట్టించుకోలేదన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి పంపింగ్ స్కీమ్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేసి ఈ ప్రాంత వాసుల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ పంపింగ్ స్టేషన్ వద్ద మురుగునీటి సమస్యపై మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీఎం.సత్యవేణి, ఎస్ఈ పాండురంగారావు, మర్రి దుర్గాశ్రీనివాస్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


కోటిలింగాలపేటలోని వేస్టేజ్ వాటర్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్

నేడు రాజమహేంద్రవరంలో
విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 11: రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. వార్షిక మరమ్మతుల నేపథ్యంలో నగరంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆర్యాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని, 11కేవీ కృష్ణానగర్ ఫీడర్, 11 కేవీవీఎం చౌల్ట్రీ ఫీడర్‌పై విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. నగరంలో కృష్ణానగర్, కోర్లంపేట, ఆర్యాపురం, తుమ్మలోవ, కోటిలింగాలపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు బాబానగర్, ఏపీపీ రోడ్డు, వెంకటరామయ్యనగర్, గోపాల్‌నగర్ పుంత, నాగమ్మతల్లి గుడి వీధి, డీవీబీ రాజు అపార్టుమెంట్ ప్రాంతం, నారాయణ పురం, బాష్యం స్కూల్ ప్రాంతం, గెయిల్ ఆఫీస్ వెనుక ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఇన్నీసుపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 7నుంచి 10గంటల వరకు తాడితోట ఇండస్ట్రియల్ కాలనీ, ఇన్నీసుపేట, స్టేడియం రోడ్డు, టీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఉదయం 8నుంచి 11గంటల వరకు కొత్తపేట, మంగళవారపుపేట, భారత్ బొమ్మల రోడ్డు, ట్రైనింగ్ కాలేజీరోడ్డు, నాగుల చెరువు బజార్, కొబ్బరికాయల మార్కెట్, నెహ్రూజంక్షన్, సీవీఎం మార్కెట్, నేతాజీ స్కూల్ సెంటర్, భావన రుషి గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. లలితానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 7నుంచి 10గంటల వరకు పేపరుమిల్లు గేట్, శ్రీరామ్‌నగర్, బీవీఎం స్కూల్ ప్రాంతం, లలితానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. సుబ్బారావునగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పీఅండ్‌టీ కాలనీ, 5వనెంబరు బస్టాండ్, కోరుకొండరోడ్డు, రాజా థియేటర్, క్వారీ సెంటర్ ఏరియా, టీవీ రోడ్డు, కొంతమూరు, భవానీపురం, రామదాసుపేట ప్రాంతం, పనసచెట్టు సెంటర్, సంజీవనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. రూరల్ మండలంలో హుక్కుంపేట సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీలో ఆదర్శనగనర్, రామకృష్ణనగర్ ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలుదపుల చేస్తున్నామన్నారు. దీని ప్రభావంతో సావిత్రినగర్, రామకృష్ణనగర్, ఆదర్శనగర్ పార్కు ప్రాంతం, కార్తికేయనగర్, చైతన్యనగర్, నాగిరెడ్డి నగర్, బాలాజీపేట, గాదాలమ్మనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 8నుంచి 10గంటల వరకు నిలిపివేస్తారని చెప్పారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ప్రపంచ జనాభాపై అవగాహన ఉండాలి
నన్నయ వర్శిటీ విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుబ్బారావు

దివాన్‌చెరువు, జూలై 11: ప్రపంచ జనాభాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుబ్బారావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నన్నయ విద్యా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆర్థికశాఖ విభాగ సహాయాచార్యులు పి.లక్ష్మీనారాయణ, యూఎన్‌వో జనాభా విశ్లేషణను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎం.గోపాలకృష్ణ, సహాయాచార్యులు ఆర్.సాంబశివరావు, జి.ఎలీషాబాబు, వి.రామకృష్ణ, జె.రాజామణి, ఎన్.సుజాత, ఆర్.ఎస్.వరహాలదొర, కేఎస్ రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను సన్మానించారు

పశువ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

బిక్కవోలు, జూలై 11: వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదముందని, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి గోలి వీర్రాజు సూచించారు. మెళ్లూరులో గురువారం రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణా కేంద్రం మండపేట వారి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి ప్రారంభించారు. శిబిరంలో 26 పశువులకు వివిధ వ్యాధులకు చికిత్సలు చేశారు. రైతులు ఎదను సరైన సమయంలో గుర్తించి గర్భధారణ చేయిస్తే పశువులు గర్భం దాల్చుతాయని మండపేట పశువైద్యాధికారి వీజీఎస్‌వీ ప్రసాద్ సూచించారు. అనంతరం రైతులు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇందల వీరబాబు, కొర్ల వినాయకరావు, రెడ్డి శ్రీను, మహిపాల సోమినాయుడు, కొర్ల నాగేశ్వరరావు, అర్జున్ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

రంగంపేట, జూలై 11: సమగ్రశిక్షలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, రఘునాథరెడ్డి కోరారు. గురువారం వారు సమగ్రశిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు రెండు నెలలుగా వేతనాలు లేవని, వెంటనే చెల్లించాలని, అంతేకాకుండా గతంలో సమ్మె చేసిన కాలానికి కూడా వేతనాన్ని చెల్లించాలని కోరారు. దానికి డైరెక్టర్ శ్రీనివాసరావు స్పందిస్తూ వేతనాలు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి
రాజమహేంద్రవరంలో రైల్వే ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): నూతన పింఛను పథకం(ఎన్‌పీఎస్) రద్దు చేసి పాత పింఛను పథకం(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైల్వే ఉద్యోగులు స్టేషన్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని నినా దాలు చేశారు. 2004 జనవరి 1 తర్వాత నియామకం పొందిన కార్మికులు అందరికీ ఓపీఎస్‌ని రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ విధానం వచ్చి రెండు దశాబ్దాలు గడిచినా కేంద్ర ప్రభుత్వం రద్దు చేయకపోవడం విచా రకరమన్నారు. కార్మికులకు అనుకూలమైన పాత పింఛను విధానాన్నే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. అందువల్ల ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ రాజమండ్రి విభాగ ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎస్.చంద్రమౌళి, లోకో రన్నింగ్ బ్రాంచి ఛైర్మన్ డి.రమేశ్, మెకానికల్, గార్డ్స్ బ్రాంచి ఛైర్మన్ టి.నాగేంద్రరావు, కార్యదర్శి వి.త్రినాథ్ పాల్గొన్నారు.

మెళ్లూరు హైస్కూల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ

బిక్కవోలు, జూలై 11: మెళ్లూరు ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను మెళ్లూరు, ఆరికరేవుల సర్పంచ్‌లు సాయిరాం, రెడ్డి నాగవేణికుమారి పంపిణీ చేసారు. ఈసందర్భంగా విద్యార్థులందరూ ప్రతి రోజు పాఠశాలకు హాజరు కావాలని, 75 శాతం హాజరు వుంటేనే తల్లికి వందనంలో రూ. ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటి అధ్యక్షుడు చినఅచ్యుతరామయ్య, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, టీడీపీ నేతలు కొర్ల వినాయకరావు, రెడ్డి శ్రీను, మహిపాల సోమినాయుడు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో ఫ్లయ్ ఓవర్ నిర్మించాలి
ఎంపీ పురందేశ్వరికి బీజేపీ నాయకుల వినతి

దివాన్‌చెరువు, జూలై 11: దివాన్‌చెరువు సెంటర్‌లో జాతీయ రహదారిపై ఫ్లయ్ ఓవర్ నిర్మించి అధిక ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరిని కోరారు. ఈ మేరకు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, కోకన్వీనర్ అడబాల గణపతిరావు, మండలాధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు, వర్రే రామకృష్ణ, బోయిడి దుర్గారావు, దొడ్డ అర్జున్, దొడ్డ శ్రీనివాస్ గురువారం ఎంపీని కలసి వినతి పత్రం అందజేశారు. దివాన్‌చెరువు విద్య వ్యాపార కేంద్రంగా ఉందని, ఈ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందని, తరచూ ట్రాఫిక్ జామ్ కావడంతో బాటు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని గణపతిరావు తెలిపారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌యూ

కడియం, జూలై 11: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని తెలుగు నాడు ఉపాధ్యాయుల సంఘం(టీఎన్‌యూ) నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.జయరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.లజపతిరాయ్, ప్రకాష్, కుమార్, కృష్ణమూర్తి, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన సమష్టి బాధ్యత

రాజానగరం, జూలై 11: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం సమష్టి బాధ్యత అని సీడీపీవో టి.నాగమణి, ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ టి.శ్రావ్య శృతి పేర్కొన్నారు. రాజానగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ప్రజ్వల సంస్థ(హైదరాబాదు)ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో మోసం చేస్తూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలను విదేశాల్లో విక్రయిస్తున్నార న్నారు. ప్రతి మహిళా తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించాల న్నారు. శ్రావ్య శృతి మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజెస్, కాల్స్ వస్తే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

భార్యపై సుత్తితో దాడి

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త సుత్తితో దాడి చేసిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పీఅండ్‌టీ కాలనీకి చెందిన శివకు, రేవతికి ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. శివ మద్యానికి బానిసై భార్యను హింసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది. దీంతో నిద్రిస్తున్న భార్య తలపై శివ సుత్తితో బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావమైన రేవతి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.

కత్తితో బెదిరించి దోపిడీ

శ్రీరాంపురానికి చెందిన ఎల్.వెంకటేశ్వరరావు సైకిల్‌పై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. రోజూ మార్కెట్ యార్డుకు వెళ్లి పండ్లు కొనుగోలు చేసి కంబాల చెరువు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తాడు. గురువారం తెల్లవారుజామున పండ్లకు వెళుతుండగా జడ్డి బంగ్లా రోడ్డులో ముగ్గురు వ్యక్తులు బెదిరించి దాడి చేసి రూ.500 దోపిడీ చేశారని గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఆవ రోడ్డుకు చెందిన ఓ బాలిక(16) గురువారం ఉదయం నుంచీ కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అదృశ్యం కేసులపై నిఘా పెట్టామని.. దర్యాప్తు వేగవంతం చేసి పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్ లేఆఫ్‌ను ఎత్తి వేయించాలి

బిక్కవోలు, జూలై 11: కానేడులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రకటించిన లేఆఫ్‌ను ఎత్తి వేయించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలెక్టర్‌ను కోరారు. గురువారం ఆయన ఇండస్ట్రీస్ కార్మికులతో కలసి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన డీసీఎల్ లేఆఫ్ చట్ట విరుద్ధమని తెలిపినా యాజమాన్యం మొండిగా లేఆఫ్ ప్రకటించడంతో 500 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, 8 నెలలుగా వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. దీంతో ఆమె వెంటనే సమస్య పరిష్కరించమని డీసీఎల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

350 కిలోల గంజాయి స్వాధీనం

గోదారిలో దూకిన వ్యక్తిని.. కాపాడిన ఫైర్ కానిస్టేబుల్ 8



తూర్పు.మార్పు: ఎంపీ, ఎమ్మెల్యేలు పరిచయ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అధికారులు

జిల్లా అసెంబ్లీ!

కలెక్టరమ్మ.. కొత్త ప్రయోగం

ఆలోచన ఉంటే.. ఆచరణకు అడ్డేముంటుంది.. ప్రణాళికా బద్ధంగా ముందడుగు వేస్తే సమస్యలకు చోటెక్కడ ఉంటుం ది.. ఎంత పెద్ద సమస్య అయినా ఇట్టే పరిష్కారమైపోతోంది.. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం అదే చేశా రు.. కొత్త కార్యక్రమానికి వినూత్నంగా శ్రీకారం చుట్టారు.. ఇప్పటి వరకూ కలెక్టరేట్‌కు సమస్యలు ఉన్నాయని ప్రజలు రావడమే చూశారు. అయితే కలెక్టర్ మాత్రం ఏకంగా జిల్లా అసెంబ్లీనే నిర్వహించారు. జిల్లా ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు.. ప్రజాప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజక వర్గాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇలా ప్రతినెలా నిర్వహిస్తే బాగుంటుందని ప్రజాప్రతినిధులే అనడం గమనార్హం.

రాజమహేంద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం.. అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం.. ప్రజా శ్రేయస్సే మనందరి లక్ష్యం.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటికి సమప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం జిల్లా స్థాయి అధికారులకు వినూత్నంగా ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు.ఒకరికొకరు పరస్పర సమన్వయంతో జిల్లాను అగ్రగామిగా నిలుపుదామన్నారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులు, రహదారుల మరమ్మతులు, సాగునీటి కాల్వల నిర్వహణ, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం,ఇళ్ల నిర్మాణాలు, రక్షిత మంచినీటి వ్యవస్థ, టిడ్కో గృహాలు కేటాయింపు వంటి సమస్యలను ప్రస్తావించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు వెల్లడించిన సమస్యలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసి పరిష్కారానికి ఒక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రజలకు అందజేయడంలోనూ, అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలుపై పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.కచ్చితమైన ఆలోచనతో అందరూ కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.ఈ పరిచయ కార్యక్రమంలో ఎస్‌పి పి.జగదీష్,ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, సబ్-కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గత భావజాలం వీడండి..



జిల్లాతో పాటు నా నియోజకవర్గం నిడదవోలులో కూడా మంచినీరు, రోడ్ల మరమ్మతులు, సీజనల్ వ్యాధుల సమస్యలు ఉన్నాయి. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. శానిటేషన్, సాగునీరు కాల్వల్లో తూడు తొలగింపు వంటి వాటిపై వెంటనే దృష్టిపెట్టాలి. సమస్య మూలం తెలుసుకుని పరిష్కరించాలి. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కొం దరు విద్యార్థులకు ఇంకా పుస్తకాలు, కిట్స్ అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.. వెంటనే అందజేయాలి. గత భావజాలం విడనాడి నూతన ప్రభుత్వ మార్గదర్శకాలతో ముందుకు వెళ్లాలి. **- కందుల దుర్గేష్, మంత్రి**

ఆవభూములపై సమగ్ర విచారణ జరపండి..



ఇళ్ల పట్టాల పంపిణీ, ఆవభూముల స్థలాల కేటాయింపు పై సమగ్ర విచారణ జరపాలన్నారు.టిడ్కో ఇళ్లను లబ్ధిదా రులకు అప్పగించాలన్నారు.ఇళ్ల పత్రాల పేరిట కొందరు డబ్బు లు వసూలు చేశారన్నా రు.వెలుగు బంద కాలనీలో మౌలిక వసతులు లేవన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రేడియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ సేవలు అందుబాటులోకి తేవాలి.
- ఆదిరెడ్డి వాసు, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే

- ఎమ్మెల్యేలు సమస్యలు చెప్పారు..
- అధికారులకు ప్రజాప్రతినిధుల పరిచయం
- వినూత్నంగా నిర్వహించిన కలెక్టర్
- 7 నియోజకవర్గాలపై స్క్రీనింగ్
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- ప్రతి నెలా నిర్వహించాలన్న ఎమ్మెల్యేలు

బరోడా బ్యాంక్ స్కామ్ తేల్చాలి..



జి.యర్రంపాలెంలోని బరోడా బ్యాంక్‌లో రూ.67 లక్షల స్కామ్ జరిగింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలి. గత ప్రభుత్వంలో నేతలు చేసిన తప్పిదాల వల్ల తమకు చెడ్డపేరు వస్తుంది. నియోజ కవర్గంలోని ఇళ్ల పట్టాల సమస్యలు, తొర్రిగడ్డ రిజర్వాయర్ , జలజీవన్ మిషన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే

యూరియా సమస్య పరిష్కరించాలి



అనపర్తి నియోజకవర్గంలో ఈ సీజన్‌లో యూరియా అవసరం చాలా ఎక్కువ. రంగంపేట, సింగనపల్లి సొసైటీల్లో డీడీ చెల్లిస్తేనే కానీ యూరియా సరఫరా చేయనంటున్నారు.వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు దృష్టి పెట్టాలి. పీహెచ్‌సీల్లో మంచినీరు,విద్యుత్ సౌకర్యం కొరత ఉన్నాయి. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే

ప్రతి నెలా ఇలా కలుద్దాం..



ప్రతినెలా ఇలా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావే శాలు నిర్వహిస్తే స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం సులభమవుతుంది. నల్లజర్లలో పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది కానీ మధ్యలో విద్యుత్ స్తంభాలు తొలగించలేదు. ఇక్కడ ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లోపం కనిపిస్తుంది.
- మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే

సమన్వయంతో పనిచేద్దాం..



కొవ్వూరు టౌన్‌లోకి ఆర్టీసీ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలి. కొవ్వూరు - నందమూరు రోడ్డు అధ్వానంగా ఉంది. ఆ రోడ్డుపై దృష్టి సారించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా శ్రేయస్సుకు తీసుకున్న నిర్ణయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఉంటేనే అమలు చేయగలుగుతాం.
- ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే

నిధులు కొరతలేకుండా చూస్తా..



రాజమహేంద్ర వరం అభివృద్ధి, నగర ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి 2027 నాటి పుష్కరాలు మంచి అవకాశం. రాష్ట్రం, కేంద్రంతో సమన్వయం చేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత లేకుండా నేను చొరవ తీసుకుంటా. గోదావరి పరిరక్షణ, రాజమహేంద్రవరం నగరం అభివృద్ధిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయండి. 2027 గోదావరి పుష్కరాలకు 5 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారనే అంచనాలు ఉన్నాయి.
- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

మీతో పాటు నేనూ కృషి చేస్తా..



ప్రజా శ్రేయస్సు కోసం ఎమ్మెల్సీగా మీతో పాటు నేనూ కృషి చేస్తా. ఈ ప్రాంత అభివృద్ధికి మంత్రి దుర్గేష్ చేపట్టే ప్రతి పనికి మద్దతుగా నిలుస్తాం. జిల్లా అభివృద్ధిలో నేను భాగస్వామినవుతా..
- వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

సమస్యల పరిష్కారంపై కార్యాచరణ



ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై అధ్యయనం చేసి పరిష్కార దిశగా కార్యాచరణ సిద్ధం చేయాలి. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో స్వచ్ఛమైన నీరు,పారిశుద్ధ్య నిర్వహణ ఉండేలా చూడాలి. అందరం కలిసి టీంగా ముందుకు వెళదాం.
- పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

ఐదేళ్లూ..చేసిందిదే!

వైసీపీ బాగోతాలన్నీ బయటకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ బాగోతాలన్నీ బట్టబయలవుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు..కొన్నిశాఖలను నిర్వీర్యం చేసింది. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన పరిచయ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఒక బుక్‌లెట్‌లో జిల్లా వివరాలు తెచ్చారు. ఇంత వరకూ నోరెత్తని అధికారులు నెమ్మదిగా సమస్యలను వెలుగులోకి తెస్తున్నారు.బకాయిలు తదితర అంశాలు చూసి ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో వివిధ పథకాల కింద చేసిన పనుల్లో రూ.కోట్ల బకాయిలు ఉన్నాయి. ఏపీఆర్ఆర్‌పి ఏఐబీ కింద చేసిన పనులకు రూ.15.84 కోట్ల బకాయి ఉంది. సీఎఫ్ఎంఎస్‌లో జీజీఎంపీ కింద రూ.10.09 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద రూ.6.80 కోట్లు, వీఆర్ఆర్ కింద రూ.2.45 కోట్లు, సీఎండీఎఫ్ కింద 1.79 కోట్లు, నాబార్డు ఆర్ఐడీఎఫ్ కింద రూ. 1.74 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.7కోట్లు బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో క్లియరెన్స్ వెయింట్‌లో ఉన్నాయి. రూ. 11.42 కోట్లు బిల్లులు ఇప్పటివరకూ జనరేట్ కాలేదు. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి గతంలో చేసిన మరమ్మతులకు సంబంధించి రూ.11.96 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా కొత్తగా 133.549 కిలోమీటర్ల రోడ్ల డామేజీ అయ్యాయి. వీటి కోసం రూ.9.11 కోట్లు ప్రతిపాదనలు చేశారు. డ్వామా డిపార్ట్‌మెంట్‌లో వివిధ బిల్డింగ్ మెటీరియల్ వర్క్స్ బిల్లులు రూ.6.40 కోట్లు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ మెటీరియల్ పనులకు సంబంధించి రూ.13 లక్షలు, సీసీ రోడ్లకు సంబంధించి 1.15 కోట్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి రూ.31 లక్షలు, సోక్‌పిట్స్ వర్కుకు కొంత సొమ్ము బకాయి ఉంది. మొత్తం రూ.8 కోట్లు బకాయి ఉంది. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీ ఎంఐపీ) కి సంబంధించి 2022-23కు 653.53 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సబ్సిడీకి రూ.18.30 కోట్లు బకాయి ఉంది. 2023-24కి రూ22.21.73 కోట్లు విడుదలచేయవలసి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో సీపీడబ్ల్యూఎస్‌కు సంబంధించిన ఓ అండ్ఎం పనులకు రూ.23.74 కోట్లు పెండింగ్‌లో ఉంది. జీజీఎంపీకి రూ.7.38 కోట్లు, సీఎండీఎఫ్ పనులకు రూ. 95 లక్షలు మొత్తం రూ. 32.07 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ బోధనా జనరల్ ఆసుపత్రిలో డీఎన్‌బీ విద్యార్థుల స్టయిఫండ్ రూ.39.87 లక్షలు పెండింగ్‌లో ఉంది. ఆల్కహాల్ అండ్ డి -ఎడిక్షన్ సెంటర్ సిబ్బది జీతాలు 8.85 లక్షలు చెల్లించలేదు. సెక్యూరిటీ స్టాఫ్ జీతాలు 5 నెలలకు రూ.40.82 లక్షలు బకాయి ఉంది. కల్యాణమస్తు పథకం కింద 305 మందికి రూ.2.96కోట్లు బకాయి ఉంది. ఉద్యాన శాఖను నిర్వీర్యం చేసేశారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చరల్ (ఎండీహెచ్) కింద 2021 నుంచి 24 వరకూ 3995 మంది లబ్ధిదారులకు రూ. 182 కోట్లు సబ్సిడీ బకాయి పెట్టారు. ఆర్కేవీవై కింద 2021 నుంచి 23 వరకూ 2025 మందికి రావలసిన సబ్సిడీ రూ.3.04 కోట్లు చెల్లించలేదు. మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ సీడ్స్ (ఎన్ఎంఈఓ-ఓపీ) కింద 26,904 మంది లబ్ధిదారులకు రూ.28.05 కోట్లు ఇవ్వలేదు. వ్యవసాయ శాఖ విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. వరి ఊడ్చే ప్రాంతాల్లో జింక్ లోపాలు ఉన్నాయి. వాటి కోసం 900 టన్నుల మైక్రోనటీరియంట్‌జిక్ అవసరం ఉంది.ఇలా అన్ని శాఖలలోనూ గత ప్రభుత్వం పెండింగ్ పెట్టింది.



బియ్యం, కందిపప్పు అందిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి

నిత్యావసరాల ధరలు నియంత్రిస్తాం

కందిపప్పు, బియ్యం అమ్మకాలు ప్రారంభించిన మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 11 : బహిరంగ మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం బియ్యం, కందిపప్పులను రైతు బజార్ల ద్వారా సరసమైన ధరలకు విక్రయించేలా కార్యాచరణ చేపట్టిందని మంత్రి కందుల లక్ష్మీదుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ రైతు బజార్‌లో గురువారం సూపర్ ఫైన్ బియ్యం, కందిపప్పు విక్రయాలను మంత్రి లక్ష్మీ దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించి మాట్లాడారు. పేదలు ఆనందంగా జీవించాలనే ఆలోచనతోనే సబ్సిడీ ధరలపై బియ్యాన్ని కిలో రూ.48లకు, కందిపప్పు కిలో రూ.160లకు విక్రయించడం జరుగుతున్నదన్నారు. కూరగాయల ధరలు తగ్గించే చర్యలు త్వరలోనే చేపడతామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నిత్యావసరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతున్నదని, ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు సాధారణ స్థితికి వచ్చే వరకూ రైతు బజార్లలో కందిపప్పు, సూపర్‌ఫైన్ రకం బియ్యం విక్రయించడం జరుగుతుందన్నారు. ఒక్కొక్కరికీ కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యం విక్రయిస్తారన్నారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా తేవాలన్నారు. విక్రయాలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. డిమాండ్ ఉంటే రైతుబజార్లలోనే కాకుండా మరిన్ని పాయింట్లలో విక్రయ కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు విక్రయాలపై పర్యవేక్షణ చేస్తామని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్, అర్బన్ తహశీల్దార్ ఆంజనేయులు, ఏఎస్‌వో నాగాంజనేయులు, ఏడీఎం సునీల్ వినయ్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.శ్రీనివాస్, ఎంఎస్‌వోలు నాగలక్ష్మి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న 7 లారీలు సీజ్



నిడదవోలు, జూలై 11 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకువచ్చినప్పటికి అక్రమార్కులు అనధికారికంగా ఇసుక రవాణా చేస్తూనే ఉన్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో దాడి చేసి 7 లారీలను సీజ్ చేసినట్టు నిడదవోలు ఎస్ఈబీ సీఐ దొరబాబు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి గోపాలపురం ఇసుక రీచ్ నుంచి 7 లారీలలో 150 టన్నుల ఇసుకను ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తుండగా పెరవలి సమీపంలో పట్టుకున్నా మన్నారు.అనుమతులు లేకపోవడంలో లారీలను సీజ్ చేశామని తెలిపారు. ఆయన వెంట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది ఉన్నారు.

విలీనం కాక.. నిధులు రాక

10 గ్రామాల విలీనానికి మోకాలడ్డిన వైసీపీ

- రాజమహేంద్రికి మహా మోసం
- ఐదేళ్లూ విలీన ఊసెత్తని వైసీపీ
- వద్దంటూ మాజీ మంత్రి వేణు లేఖ
- నాటి కలెక్టర్ మాధవీలత ఆమోదం
- మహానగరం కాలేకపోయిన రాజమండ్రి
- కేంద్రం నిధులు హుష్‌కాకి
- అయినా పట్టించుకోని నాటి పాలకులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 11 : రాజమహేంద్రవరాన్ని మహానగరంగా మార్చేందుకు పది గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదనలకు రాష్ట్ర గవర్నర్ ఆమోదముద్రవేసి ఆర్డినెన్స్ జారీ చేశారు. అయితే గవర్నర్ ఆదేశాలను సైతం గత ప్రభుత్వం పక్కనపెట్టి గ్రామాల విలీనానికి వ్యతిరేకంగా అప్పటి కలెక్టర్ డాక్టర్ మాధవీలత తీర్మానం చేసి సీడీఎంఏకు పంపిన సంగతి బహుశా ఎవరికీ తెలియకపోవచ్చు. ఎందుకంటే అదంతా చాలా సైలెంట్‌గా జరిగిపోయింది. రాజమహేంద్రవరాన్ని మహానగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 24 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. అయితే ఆయా గ్రామాల నుంచి ఒకరిద్దరు న్యాయస్థానాలకు వెళ్లడంతో ఆ సంఖ్య పది గ్రామాలకు చేరింది. గ్రామాల విలీనానికి అవసరమైన ప్రక్రియ అంతా పూర్తి చేయ డంతో రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలిపారు. తీరా అన్ని పనులు పూర్తయ్యే సరికి వైసీపీ ప్రభుత్వం దీనికి మోకాలడ్డింది.

విలీనం వద్దని మాజీ మంత్రి వేణు లేఖ

రాజమహేంద్రవరంలో పది గ్రామాలు విలీనం కావడం ద్వారా నగర విస్తరణ మరింతగా పెరిగి ప్రస్తుతం ఉన్న జనాభా 5 లక్షలకు మరొక లక్షా 50 వేల మంది కలిసి సుమారుగా 6 నుంచి 7 లక్షల మంది జనాభాతో రాజమహేంద్రవరం పెద్దనగరంగా అవతరించే అవకాశం ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల విలీనం అంశం తెరపైకి వచ్చినట్టే వచ్చి మళ్లీ వెనక్కిపోయింది. వైసీపీ హయాంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రాజమహేంద్రవరంలో పది గ్రామాల విలీన ప్రక్రియను వ్యతిరేకించారు. దానికి కారణం ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిధులు గ్రామాలకు రావని అందువల్ల విలీనాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఒక లేఖను కలెక్టర్‌కు పెట్టారు. అప్పటివరకు గ్రామాల వీలీనం చేసేద్దామని అన్ని చర్యలు చేపట్టిన అప్పటి అధికార యంత్రాంగం ఒక్కసారిగా వాటిని నిలుపుదల చేసింది. పైగా గ్రామాల విలీనాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని డీపీవోతో డీలిమిటేషన్ ప్రతిపాదనలు పెట్టించారు. నగరపాలక సంస్థ పాలక మండలి లేకపోవడంతో సుప్రీం అథారిటీ కింద కలెక్టర్ దానిని కౌన్సిల్ రిజల్యూషన్ చేయించారు. అక్కడ నుంచి దానిని సీడీఎంఎ(కార్పొరేషన్ డైరెక్టర్ అండ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్)కు పంపించారు. దానిని ప్రభుత్వం ఆమోదించాల్సి ఉండగా ఎన్నికలు వచ్చేశాయి. దీంతో పెండింగ్‌లో ఉంది.

నష్టపోతున్న రాజమహేంద్రవరం

రాష్ట్రంలో అతిపెద్ద నగరాలుగా విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం ఉన్నాయి. వాటితో పాటు సమానంగా నిలవాల్సిన రాజమహేంద్రవరం వాటి సరసన నిలిచే అవకాశంలేకుండా వెనకడుగు పడుతోంది. ఎటు చూసిన పది కిలోమీటర్ల సిటీ పరిధి లేకుండా రాజమహేంద్రవరం ఉండడం శాపంగా మారుతోంది. రాజమహేంద్రవరంలో వేమగిరి,ధవళేశ్వరం, బొమ్మూరు, హుక్కుంపేట, శాటిలైట్ సిటీ, పిడింగొయ్యి, రాజవోలు, కాతేరు, తొర్రేడు, వెంకటనగరం గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదనకు గవర్నర్ రాజముద్ర వేశారు. కానీ గత ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరించింది. రాజమహేంద్రవరం ప్రస్తుత విస్తీర్ణం 44 చదరపు కిలోమీటర్లు ఉంది. ఇందులో సుమారు 22 చదరపు కిలోమీటర్లు గోదావరి నదిలో ఉండగా మిగిలింది 22 మాత్రమే. గ్రామాల విలీనం జరిగితే విస్తీర్ణం పెరిగి నగరం మరింతగా పెరుగుతుంది. నగర వైశ్యాలంను బట్టి నగరాలకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఈ కేటాయింపులో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాలతో పోల్చితే 50 శాతం రావడంలేదు. అందుకే గ్రామాల విలీనం చేయాల్సిన బాధ్యత కూటమిపై ఉంది.

వ్యవసాయాధికారులేరి?

గోకవరం, జూలై11: ఒక పక్క జోరు వర్షాలు.. మరో పక్క మొదలైన వ్యవసాయ పనులు. ఇటువంటి సమయంలో రైతులకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పత్తా లేకుండా పోతున్నారు. ఫోన్‌లకూ దొరకడంలేదు. వ్యవసాయపరమైన సమస్యలను అడిగి తెలుసుకునేందుకు కార్యాలయానికి వెళుతుంటే అక్కడ ఏ ఒక్క అధికారి జాడ కానరావడంలేదని రైతాంగం వాపోతున్నారు. ఇలా ఒకసారి, రెండుసార్లు కాదు.. వారంలో నాలుగైదు రోజులు ఇలాంటి పరిస్థితే ఎదురవుతుందని బాధిత రైతులు మండిపడుతున్నారు. గోకవరం మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి అందే వ్యవసాయపరమైన సహాయ, సహకారాలు పొందేందుకు, ఎరువులు, ఇతర అవసరాల నిమిత్తం మండల వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళుతుంటే అక్కడ అధికారులు కనిపించక రైతులు లబోదిబోమంటున్నారు. ఒకవేళ అధికారులు ఏదొక సమయంలో వస్తారని కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూస్తున్నా వారి దర్శనభాగ్యం మాత్రం కలగడం లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారిణి మాట ఎలా ఉన్నా కిందిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండడంలేదని విమర్శిస్తున్నారు. కోరుకొండ, రాజమహేంద్రవరంలలో సమావేశాలంటూ సంబంధిత అధికారులు నిత్యం కార్యాలయానికి డుమ్మా కొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పాలకులు వ్యవసాయ శాఖ సిబ్బంది తీరును పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.



గురువారమైనా తెరుచుకోని వ్యవసాయ శాఖ కార్యాలయం

12 డైరెక్టర్ పదవులకు 66 మంది నామినేషన్లు

రసవత్తరంగా అర్బన్ బ్యాంక్ ఎన్నిక

రాజమహేంద్రవరం, జూలై11(ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు రసవత్తంగా మారనున్నాయి. 12 డైరెక్టర్ పదవులకు గురువారం ఏకంగా 66 మంది నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ కూటమి ప్యానల్ చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ ప్యానల్‌కు ఎంపికైన మిగతా 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ మద్దతుదార్లుగా అనేక మంది ఇష్టానుసారం నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం. మొత్తం ఆర్యాపురం బ్యాంక్ పరిధిని మూడు నియోజకవర్గాలుగా విభజించారు. ఒకటో నియోజకవర్గంలో ఆర్యాపురం మెయిన్ బ్రాంచి, కోటగుమ్మం, తాడితోట, కాతేరు, స్వరాజ్యనగర్,జెఎన్‌రోడ్, బొమ్మూరు, దానవాయిపేట బ్రాంచిలు ఉంటాయి. వీటి పరిధిలో ఓటర్లు 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు.ఈ నియోజకవర్గంలో 10 డైరెక్టర్ పదవులకు 62 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండో నియోజకవర్గం కింద కాకినాడ,తాడేపల్లిగూడెం, తణుకు బ్రాంచిల పరిధిలో ఒక డైరెక్టర్ పదవి ఉంది. నడకుదురుకు చెందిన సింగంపల్లి వెంకట రామకృష్ణ ఒకరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైంది. 13వ తేదీన అధికారికంగా ప్రకటిస్తారు. మూడో నియోజకవర్గం కింద దివాన్ చెరువు, భీమవరం, అమలాపురం, వైజాగ్(సీతమ్మధార), గుంటూరు బ్రాంచిల పరిధిలో ఒక డైరెక్టరును ఎన్నుకుంటారు. కానీ ఇక్కడ ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో టీడీపీ కూటమి ప్యానల్‌కు చెందిన దివాన్‌చెరువు వాసి నీలపాలన సూర్యసత్యనారాయణతో పాటు దివాన్‌చెరువుకు చెందిన మరొకరు, అమలాపురానికి చెందిన ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన తర్వాత 13 ఉపసంహరణ గడువు ఇస్తారు.అదేరోజు ఫైనల్ లిస్ట్ ప్రకటిస్తారు. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేస్తే 20న పోలింగ్ జరిగే అవకాశం ఉంది. టీడీపీ కూటమి ప్యానల్‌తో పాటు వైసీపీ కూడా ప్యానల్‌ను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. రెండు డైరెక్టర్ పదవులకు సీపీఐ నుంచి జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు.

గోపాలపురంలో అత్యధిక వర్షపాతం నమోదు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 11: జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమొదరు జల్లులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. గడచిన 24 గంటల్లో గోపాలపురంలో అత్యధికంగా 10 మి.మీ వర్షపాతం నమోదైందని వాతవరణ శాఖ తెలిపింది. అత్యల్పంగా దేవరపల్లిలో 1.0 మి.మీ వర్షకురిసింది. అనపర్తిలో 2.4 మి.మీ, బిక్కవోలు 1.2 మి.మీ, కోరుకొండలో 9.0 మి.మీ, రంగంపేటలో 5.4 మి.మీ, సీతానగరంలో 2.6 మి.మీ, తాళ్ళపూడిలో 1.4 మి.మీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో వాతావరణం పొడిగా ఉంది. గురువారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపాడు. జనం ఉక్కబోతకు గురయ్యారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్

ఉండ్రాజవరం, జూలై 11: ఉపాధ్యాయులకు అకడమిక్ క్యాలండర్‌ను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ కోరారు. కాకినాడలో ఆగస్టులో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు సమాయత్తం కావాలని ఆయన గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, చివటం గ్రామంలో మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా అకడమిక్ క్యాలండర్ విడుదల చేయకపోవడం వల్ల ఉపాధ్యాయుల సమయపాలనలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూల్లో విలీనం చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడంలో జీవో 117 పాత్ర ఎక్కువగా ఉందన్నారు. ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. దీనిపై కూటమి ప్రభుత్వం రద్దు చేయడానికి హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో స్వర్ణోత్సవానికి హాజరు కావాలని జయకర్ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కె.వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఐ.రాంబాబు, ఎస్.లక్ష్మీనారాయణ, బి.రామారావు, మహిళా అధ్యక్షురాలు ఎమ్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తులు అందజేత



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 11: కొవ్వూరు కాకతీయ ప్లాజాలో గురువారం వెన్నెల అంధుల సేవా ట్రస్టు 20వ వార్షికోత్సవం నిర్వహించారు. దీనికి మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి ముఖ్యఅతిధిగా విచ్చేసి దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనపర్తి గోపాలకష్ణ వెన్నెల అంధుల సేవా ట్రస్టు, స్వామి వివేకానంద, బుద్ధా జిల్లా ఫౌండేషన్, వశిష్ట గౌతమి పిరమిడ్ జ్ఞాన వేదిక, అనపర్తి గోపాలకృష్ణ కళాపరిషత్, స్వామి వివేకానంద జీవకారుణ్య సంఘాలు ఏర్పాటుచేసి సమాజహితం కోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు, మద్దుల సత్యనారాయణ, పరిమి గెరట మోహనరావు, మల్లిన గోపి, పొట్లూరి కిషోర్, టి.మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, జూలై 11: నిడదవోలులోని తీరుగూడెం ఫీడరులో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 12న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. దీంతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గాంధీనగర్, జ్యోతికాలనీ, సుబ్బరాజుపేట, ఎన్టీఆర్ కాలనీ, తీరుగూడెం, శింగవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

దేవరపల్లి: దేవరపల్లిలో చెట్ల కొమ్మలు, మరమ్మతులు నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం 6గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏఈ కె.కృష్ణారావు తెలిపారు.

పెరవలి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల తొలగింపు నిమిత్తం పెరవలి, అజ్జరం, కాకరపర్రు, వెంకటరాయపురం, తీపర్రు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఈఈ వీరభద్రరావు తెలిపారు. అలాగే నల్లాకులపాలెం, అన్నవరప్పాడు, పిట్టలవేమవరం, ఖండవల్లి గ్రామాల్లో ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

జీవితంపై విరక్తితో గోదావరిలో దూకిన వ్యక్తి

కాపాడిన ఫైర్ కానిస్టేబుల్



గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించి బయటకు తీసుకొస్తున్న దృశ్యం



ఫైర్ కానిస్టేబుల్ ప్రకాష్‌బాబు

కొవ్వూరు, జూలై 11: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కొవ్వూరు ఫైర్ కానిస్టేబుల్ రక్షించాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటరమణమూర్తి 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నిద్ర లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో కొవ్వూరు గామన్ బ్రిడ్జి పైనుంచి ఈ నెల 11వ తేదీ రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది స్కూబా డైవ్ మాస్టర్, సిమ్మింగ్ ట్రైనర్ ఎం.ప్రకాష్‌బాబు రెస్క్యూ బోట్‌తో హుటాహుటిన నదిలోకి వెళ్లి వెంకటరమణమూర్తిని రక్షించి బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణమూర్తిని రక్షించిన ప్రకాష్‌బాబును ఫైర్ అధికారి ఏబీఎన్ఎస్ వేణు అభినందించారు.

దేవరపల్లిలో మట్టి శివలింగాల తయారీ



దేవరపల్లిలో మట్టి శివలింగాలు తయారు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, జూలై 11: రాజమహేంద్రవరంలో 2025 ఫిబ్రవరి (మాఘ మాసం)లో కోటి మట్టి శివలింగాల అర్చన నిర్వహించనున్న సందర్భంగా దేవరపల్లి గ్రామ పరిసర భక్తులందరూ స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మట్టి శివలింగాలను ప్రతిరోజు తయారు చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి 15000 శివలింగాలు తయారు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 17 వరకు ఈ శివలింగాలు తయారు చేస్తామని చెప్పారు.

స్వచ్ఛ సంకల్పం అందరి బాధ్యత



చాగల్లులో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, జూలై 11: ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సంకల్పంపై గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వ్యాపార సంస్థల యజమానులతో సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని, అమ్మకాలు జరపకుండా బాధ్యతగా పనిచేయాలని గ్రామీణ అభివృద్ధి, విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రజలందరు స్వచ్ఛందంగా స్వచ్ఛ సంకల్పంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, వ్యాపార సంస్థల ప్రతినిధులు గ్రంధి వెంకటేశ్వరరావు, ఎన్‌వీవీఎస్ గుప్త, గ్రంధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

రంగంపేట, జూలై 11: సమగ్రశిక్షలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, రఘునాథరెడ్డి కోరారు. గురువారం వారు సమగ్రశిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు రెండు నెలలుగా వేతనాలు లేవని, వెంటనే చెల్లించాలని, అలాగే గతంలో సమ్మె చేసిన కాలానికి వేతనాన్ని చెల్లించాలని కోరారు. దానికి డైరెక్టర్ శ్రీనివాసరావు స్పందిస్తూ వేతనాలు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

▸▸ నిడదవోలు మండల సమావేశంలో మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 11: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యా లయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఉన్న పిల్లలందరూ చదువుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వర్షాకాలంలో చిన్నారులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడం, వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల అతిసార వంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. ఎర్రకాలువ వల్ల పంటలు మునిగిపోతున్నాయని, గత ప్రభుత్వం గుర్రపుడెక్క సకాలంలో తీయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నిధులు కేటాయించి, టెండర్లు పిలిచామన్నారు. పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండావిద్యాశాఖాధికార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ, ఎంపీపీ తిరుమళ్ళ భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ కొయ్యే సూరిబాబు పలుశాఖల అధికార్లు పాల్గొన్నారు.

● నిడదవోలులోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు విక్రయాలను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

విద్యాశాఖలోకి మార్చండి

నిడదవోలులోని 13 వార్డుల్లో ఉన్న సచివాలయాల్లో వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలుగా విధులు నిర్వహిస్తున్న తామంతా కంప్యూటర్ పట్టభద్రులమని, విద్యా వ్యవస్థకు చెందిన పరీక్ష ద్వారా నియమితులమయ్యామని, తమకు విద్యాశాఖ మాతృశాఖగా గుర్తించాలని సమిశ్రగూడెంలో మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం అధ్యాపకులుగా ఉన్న తమ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తమను విద్యాశాఖలోకి మార్చాలని కోరారు. దీనిపై మంత్రి దుర్గేష్ స్పందిస్తూ తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుప్రియ, శ్రావణి, శ్రీవిద్య బాలగంగాధరరావు, విక్రమ్, శ్రీనివాస చక్రవర్తి, ఫణికుమార్ తదితరులున్నారు.



దేవరపల్లి: గౌరీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



కొవ్వూరు మండలం దొమ్మేరులో..

ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ పాటించాలి

▸▸ గౌరీపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్

▸▸ పలుచోట్ల ప్రపంచ జనాభా దినోత్సవం

దేవరపల్లి, జూలై 11: ప్రపంచ జనాభా నానాటికి పెరిగిపోతోందని, దీని వల్ల భవిష్యత్‌లో మనుగడ కష్టమవుతుందని, ప్రతిఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని గౌరీపట్నం వైద్యాధికారి సతీష్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పలుచోట్ల గురువారం నిర్వహించారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ చేపట్టారు. డాక్టర్ సతీష్, డాక్టర్ ఎండీ అలీ మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడేళ్ల ఎడం ఉండాలని, అందుకోసం భార్యాభర్తలు కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు పాటించాలన్నారు. అప్పుడే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో శ్రీకృష్ణుడు, సూపర్‌వైజర్ అశోక్ వర్ధన్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు: దొమ్మేరు పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు ఆధ్వర్యంలో ర్యాలీ జరిపి, ప్రజలకు కుటుంబ నియంత్రణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ వంటి అంటువ్యాధులను అరికట్టాలని, తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండాలని, కుటుంబ ప్రణాళిక పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ దివ్య, సీహెచ్‌వో బీవీ లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ టి.సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: పెరవలి పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఏఎస్ కృష్ణవేణి మాట్లాడుతూ తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డ బిడ్డకు మధ్య అంతరం ఉండాలనేదే ప్రపంచ జనాభా దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమూర్తి, ఉంగటి రాజేష్‌బాబు, రాణి, ఏసురాణి పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద హెల్త్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజలు సహకరించి బాల్య వివాహాలను జరుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని చేయాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించిందని మానవత సేవా సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యుడు జోడాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆనాటి నుంచి ప్రతి సంవత్సరం జూలై 11న పలు దేశాలు జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయని పేర్కొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో పీహెచ్‌సీ డాక్టర్లు ఆర్ఎస్ ప్రసాద్, ఆర్.ఉషాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని, చిన్నకుటుంబాలు సమాజంలో ఆర్థికంగా ఎదగడానికి ఎంతో వీలుంటుందని డాక్టర్లు అన్నారు. బిడ్డకు బిడ్డకు అంతరాయం ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీవీ కుమారి, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాస్, నాగమణి, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



పెరవలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



తాళ్లపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సబ్సిడీపై సన్నబియ్యం, కందిపప్పు పంపిణీ



కొవ్వూరు మెరక వీధిలో విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 11: ధరల నియంత్రణలో భాగంగా ప్రజలకు సబ్సిడీపై సన్నబియ్యం, కందిపప్పు అందజేస్తున్నట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతుబజారులో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై సన్నబియ్యం విక్రయ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో ప్రజలకు కిలో రూ.49కే సన్నబియ్యం, కిలో కందిపప్పు రూ. 160కే అందిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు రైతులు అన్నివిధాల బాగుంటేనే సమాజం బాగుంటుందని నమ్మే వ్యక్తి అన్నారు. రైతు బజారులు ఏర్పాటుచేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, అన్నిరకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పంట నష్టపోయిన రైతులకు రూపాయి పరిహారం అందించలేదని, గిట్టుబాటు ధర ఊసు అసలే లేదన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్లు సబ్సిడీపై అందిస్తారన్నారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి డబ్బు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతుల ధాన్యం సొమ్మును ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఇంకా బకాయిలుంటే త్వరలోనే చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, తహశీల్దార్ కె.మస్తాన్, ఏఎంసీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు, సీఎస్ డీటీ టి.సునీత, ఆర్ఐ విశ్వేశ్వరరావు, సర్పంచ్ మేకల శ్రీను, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మట్టే ప్రసాద్, నందిన సత్యనారాయణ, చెరుకూరి శ్రీనివాస్, సూరపనేని శివరామకృష్ణ పాల్గొన్నారు.

353 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓ లారీలో రవాణా చేస్తున్న గంజాయిని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ వివరాలను వెల్లడించారు. దివాన్ చెరువు జంక్షను వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా కాకినాడ నుంచి రాజస్తాన్ వెళ్తున్న ఓ లారీలో 153 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. సీరారామ్, గోమద్ రామ్ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో కాకినాడ రూరల్ సర్పవరంలో మరో 200 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. అక్కడ తిమ్మాపురానికి చెందిన కోటిబోయిన ప్రసాద్, ఒడిసాకు చెందిన ప్రతాప్ మండల్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం రూ.20 లక్షలు విలువ చేసే 353 కిలోల గంజాయి, రూ.6వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. గంజాయి రవాణాకు కారణమైన రాజస్తాన్‌కి చెందిన రామ్ నివాస్, సందీప్ అనే వ్యక్తులను కూడా అరెస్టు చేశామని చెప్పారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

స్నేహితుడికి తీవ్ర గాయాలు

రాజానగరం, జూలై 11: మండలంలో పరిజెల్లిపేట సమీపంలోని చాగల్నాడు కాలువ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడిక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. తొకాడ గ్రామానికి చెందిన నల్లమిల్లి సందీప్(20), అతడి స్నేహితుడు గండి వీరవెంకట సత్యనారాయణ కలిసి మోటార్‌సైకిల్‌పై రాజానగరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో చాగల్నాడు కాలువ సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్ కిందపడిపోవడంతో లారీ అతడి పైనుంచి దూసుకుపోవడంతో శరీర భాగాలు చెల్లాచెదురై అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన ఎరువులు ఇవ్వండి

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

● సబ్‌డివిజన్ పరిధిలోని డీలర్లతో సమావేశం



దివాన్‌చెరువు: రైతుబజారులో బియ్యం, కందిపప్పు విక్రయాలు ప్రారంభిస్తున్న బత్తుల

కోరుకొండ, జూలై 11: నియోజకవర్గంలోని రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఎరువుల డీలర్లకు సూచించారు. కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం కోరుకొండ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలకు చెందిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో రైతులకు ప్రతి ఎకరాకు అవసరమైన సాగునీరు రెండు పంటలకు సకాలంలో సక్రమంగా అందిస్తామని, దానికి తోడు డీలర్లు అందరూ రైతులకు మంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలన్నారు. గతంలో వ్యవసాయ యంత్రాలను గ్రూపులకు అందజేసేవారని, అయితే ప్రస్తుతం రైతులకు వ్యక్తిగతంగా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను డీలర్లు సత్కరించారు. వారం రోజులుగా జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులపై విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్న నేపథ్యంలో కోరుకొండలో ఈ సమావేశం చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కాకి మాధవరావు, ఏడీఏ మల్లికార్జునరావు, ఎంపీడీవో హేమసుందరరావు పాల్గొన్నారు. అలాగే లాలాచెరువు హౌసింగ్‌బోర్డులోని రైతుబజారులో ప్రభుత్వ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే బత్తుల ప్రారంభించారు.

దివాన్‌చెరువులో ఫ్లయ్ ఓవర్ నిర్మించాలి

ఎంపీ పురందేశ్వరికి బీజేపీ నాయకుల వినతి

దివాన్‌చెరువు, జూలై 11: దివాన్‌చెరువు సెంటర్‌లో జాతీయ రహదారిపై ఫ్లయ్ ఓవర్ నిర్మించి అధిక ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు.ఈ మేరకు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, కోకన్వీనర్ అడబాల గణపతిరావు, మండలాధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు, వర్రే రామకృష్ణ, బోయిడి దుర్గారావు, దొడ్డ అర్జున్, దొడ్డ శ్రీనివాస్ గురువారం ఎంపీని కలసి వినతి పత్రం అందజేశారు. దివాన్‌చెరువు విద్య వ్యాపార కేంద్రంగా ఉందని, ఈ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందని, తరచూ ట్రాఫిక్ జామ్ కావడంతో బాటు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని గణపతిరావు తెలిపారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌యూ

కడియం, జూలై 11: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని తెలుగు నాడు ఉపాధ్యాయుల సంఘం(టీఎన్‌యూ) నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.జయరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.లజపతిరాయ్, ప్రకాష్, కుమార్, కృష్ణమూర్తి, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన సమష్టి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

రాజానగరం, జూలై 11: మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం సమష్టి బాధ్యత అని సీడీపీవో టి.నాగమణి, ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ టి.శ్రావ్య శృతి పేర్కొన్నారు. రాజానగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ప్రజ్వల సంస్థ(హైదరాబాదు)ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో నాగమణి మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా అతిపెద్ద నేరమని, ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో మోసం చేస్తూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలను విదేశాల్లో విక్రయిస్తున్నారన్నారు. ప్రతి మహిళా తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించాలన్నారు. శ్రావ్య శృతి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులు ఏర్పాటు చేయడం ద్వారా అందరూ అప్రమత్తంగా ఉంటారన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజెస్, కాల్స్ వస్తే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

రాజమహేంద్రవరంలో రైల్వే ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): నూతన పింఛను పథకం(ఎన్‌పీఎస్) రద్దు చేసి పాత పింఛను పథకం(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైల్వే ఉద్యోగులు స్టేషన్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని నినా దాలు చేశారు. 2004 జనవరి 1 తర్వాత నియామకం పొందిన కార్మికులు అందరికీ ఓపీఎస్‌ని రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ విధానం వచ్చి రెండు దశాబ్దాలు గడిచినా కేంద్ర ప్రభుత్వం రద్దు చేయకపోవడం విచా రకరమన్నారు. కార్మికులకు అనుకూలమైన పాత పింఛను విధానాన్నే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. అందువల్ల ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రాజమండ్రి విభాగ ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎస్.చంద్రమౌళి, లోకో రన్నింగ్ బ్రాంచి చైర్మన్ డి.రమేష్, మెకానికల్, గార్డ్స్ బ్రాంచి చైర్మన్ టి.నాగేంద్రరావు, కార్యదర్శి వి.త్రినాథ్ పాల్గొన్నారు.

బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్ లేఆఫ్‌ను ఎత్తి వేయించాలి

బిక్కవోలు, జూలై 11: కానేడులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రకటించిన లేఆఫ్‌ను ఎత్తి వేయించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలెక్టర్‌ను కోరారు. గురువారం ఆయన ఇండస్ట్రీస్ కార్మికులతో కలసి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన డీసీఎల్ లేఆఫ్ చట్ట విరుద్ధమని తెలిపినా యాజమాన్యం మొండిగా లేఆఫ్ ప్రకటించడంతో 500 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, 8 నెలలుగా వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. దీంతో ఆమె వెంటనే సమస్య పరిష్కరించమని డీసీఎల్‌ను ఆదేశించారు.

పశువ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

బిక్కవోలు, జూలై 11: వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదముందని, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి గోలి వీర్రాజు సూచించారు. మెళ్లూరులో గురువారం రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణా కేంద్రం మండపేట వారి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి ప్రారంభించారు. శిబిరంలో 26 పశువులకు వివిధ వ్యాధులకు చికిత్సలు చేశారు. రైతులు ఎదను సరైన సమయంలో గుర్తించి గర్భధారణ చేయిస్తే పశువులు గర్భం దాల్చుతాయని మండపేట పశువైద్యాధికారి వీజీఎస్‌వీ ప్రసాద్ సూచించారు. అనంతరం రైతులు మందులు పంపిణీ చేశారు.

భార్యపై సుత్తితో దాడి

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త సుత్తితో దాడి చేసిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పీఅండ్‌టీ కాలనీకి చెందిన శివకు, రేవతికి ఐదేళ్ల కిందట వివాహం జరి గింది. శివ మద్యానికి బానిసై భార్యను హింసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది. దీంతో నిద్రిస్తున్న భార్య తలపై శివ సుత్తితో బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావమైన రేవతి ప్రభు త్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.

బాలిక అదృశ్యం

ఆవ రోడ్డుకు చెందిన ఓ బాలిక(16) గురువారం ఉదయం నుంచీ కని పించడం లేదని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అదృశ్యం కేసులపై నిఘా పెట్టామని.. దర్యాప్తు వేగవంతం చేసి పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---